# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710



ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | గురువారం-04- డిసెంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 187 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in






# తెలంగాణ రైజింగ్‌కు ప్రధాని మోడీకి ఆహ్వానం

- రాజ్‌నాథ్ సహా పలువురు కేంద్రమంత్రులకు ఇన్విటేషన్
- భట్టితో కలసి ఆహ్వానించిన సిఎం రేవంత్
- దేవుళ్లపై వ్యాఖ్యలను వక్రీకరించారని ఆగ్రహం



న్యూఢిల్లీ, డిసెంబర్3 (తెలంగాణ ముచ్చట్లు): దేశ రాజధాని దిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలసి ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్'కు ప్రధాని మోదీని ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ప్రధాని మోదీకి సీఎం విజ్ఞప్తి చేశారు. తులంగాణ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్`బెంగళూరు`చెన్నై బుల్లెట్ రైలు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ విస్తరణకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ ప్రాజెక్టుకు అనుమతులు, నిధులు ఇవ్వాలని అభ్యర్థించారు. పలువురు కేంద్ర మంత్రులతో పాటు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలను కలిసిన సీఎం సమ్మిట్‌కు ఆహ్వానించారు. కాగా, మంగళవారం రాత్రి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను సీఎం రేవంత్‌రెడ్డి కలిసి గ్లోబల్ సమిట్‌కు రావాలని కోరారు. తరవాత సిఎం రేవంత్ మీడియాతో చిట్‌చాట్‌లో ..తెలంగాణలో పదేళ్లు తన నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హిందూ సమాజంలాంటిదే కాంగ్రెస్ అని డీసీసీ అధ్యక్షులకు చెప్పానని సిఎం వివరించారు. పార్టీ నేతగా ఎలా పనిచేయాలనేది వివరించే క్రమంలో చెప్పానన్నారు. జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ కోల్పోవడంతో భాజపా దీన్ని వివాదం చేస్తోందని మండిపడ్డారు. పార్టీలో అంతర్గతంగా మాట్లాడిన వ్యాఖ్యలను ఎడిట్ చేసి ప్రచారం చేస్తున్నారని విపక్షాలపై మండిపడ్డారు. ఉత్తర భారతంలోనూ తనను పాపులర్ చేస్తున్నందుకు సంతోషమని వ్యాఖ్యానించారు. తాను కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా మాట్లాడిన విషయాల్లో ముందు వెనక కట్ చేసి కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లు తెలంగాణలో తన నేతృత్వంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని స్పష్టం చేశారు. హిందూ దేవుళ్లు, హిందూ సమాజం లాంటిదే కాంగ్రెస్

మిగతా 2లో

## త్వరలోనే మరో 40వేల ఉద్యోగాల భర్తీ

- ఇప్పటికే 60వేల ఉద్యోగాలు భర్తీ చేసాం
- హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చేసేది లేదు
- తెలంగాణ ఉద్యమ జ్వాలలకు కరీంనగర్ కేంద్రం
- ఎట్టి పరిస్థితుల్లోనూ గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తాం
- బిఆర్ఎస్ కట్టిన కాళేశ్వరం ఏమయ్యిందో చూశాం
- రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం
- సమర్థులనే సర్పంచ్‌లుగా ఎన్నుకోండి
- హుస్నాబాద్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి

సిద్దిపేట, డిసెంబరు3 (తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. తమ ప్రభుత్వంలో ఇప్పటికే 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని.. త్వరలో మరో 40 వేల ఉద్యోగాలు ఇస్తామని స్పష్టం చేశారు. రెండున్నరేళ్ల పాలన పూర్తయ్యేలోగా లక్ష ఉద్యోగాలు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

మిగతా 2లో



## రాహుల్‌ను విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదు

### మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి బిఆర్ఎస్ నేత కేటీఆర్‌కు లేదని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు.

మిగతా 2లో





## ఉద్యోగాల చిరునామా తెలంగాణ

- రెండేళ్లలో 61,379 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ
- తుది దశలో మరో 8,632 నియామకాలు
- లక్ష ఉద్యోగాల మైలురాయి దిశగా ప్రయాణం
- యువతకు ఉద్యోగం.. తెలంగాణ భావోద్వేగం

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు): రెండేళ్లలో తెలంగాణ యువత భవిత మలుపు తిరిగింది. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇప్పటివరకు రాష్ట్రంలో 61,379 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసింది.

మిగతా 8లో

## కుప్పకూలిన రెవెన్యూ వ్యవస్థను రెండేళ్లలో పునర్నిర్మించాం

- భూ హక్కుల నుంచి రిజిస్ట్రేషన్ల వరకు సమూల మార్పులు
  2. 29 కోట్ల సర్వే నెంబర్లకు భూధార్ నెంబర్ కేటాయింపునకు చర్యలు
- 373 నక్షా గ్రామాల్లో రీసర్వేకు సన్నాహాలు
- వచ్చే జనవరి నాటికి మూడు శాఖల సమాచారంతో ప్రత్యేక యాప్
- అక్రమాలపై రెండు జిల్లాలో సాగుతున్న ఫోరెన్సిక్ ఆడిట్
- భూ సమస్యలపై త్వరలో ట్రిబ్యునల్స్ ఏర్పాటు
- ఒకే గొడుగు కిందకు ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్
- హిల్ట్ పాలసీపై బి ఆర్ ఎస్ ద్వంద్వవైఖరి
- ఆనాటి మున్సిపల్ మంత్రి ముడుపులు తీసుకొని ల్యాండ్ కన్వర్షన్ చేశారుని
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్రంలో రెండేళ్లలో రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలో ప్రజల సౌలభ్యం కోసం విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన

మిగతా 2లో



## కోతులను పారదోలే వారే ఓట్లకోసం రండి

- రేగొండ గ్రామంలో పోస్టర్ వేసిన యువత
- కోతుల బెడద తప్పించే వారికే ఓటేస్తామని హెచ్చరిక

జయశంకర్ భూపాలపల్లి,డిసెంబర్3 (తెలంగాణ ముచ్చట్లు): సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు నానా పాట్లు పడుతున్నారు. మరోవైపు ప్రజలు కూడా ప్రధాన సమస్యలపై నిలదీస్తున్నారు. సాధారణంగా సర్పంచ్ అభ్యర్థులు ఓట్లు అడగడానికి వస్తే.. ఎవరైనా తమ ఊరిని అభివృద్ధి చేయాలని అడుగుతారు.

మిగతా 2లో




## కోకాపేటలో కాసులు కురిపిస్తున్న వేలం

- హెచ్ఎండిఎ ఖాతాలో మరో వేయికోట్లు

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు): కోకాపేట నియోపొలిస్ భూములకు మూడో విడత వేలం ప్రక్రియ ముగిసింది. బుధవారం ప్లాట్ నెంబర్ 19, 20లోని 8.04 ఎకరాలకు అధికారులు ఈ`వేలం నిర్వహించారు.

మిగతా 8లో






## పవన్ వ్యాఖ్యలు తెలంగాణకు వ్యతిరేకం

- తెలంగాణకు ఏనాడూ మద్దతు ఇవ్వని పవన్
- మండిపడ్డ జాగృతి అధ్యక్షురాలు కవిత

8లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# తెలంగాణ రైజింగ్‌కు ప్రధాని మోడీకి ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

అని కొత్తగా ఎన్నికైన తమ పార్టీ జిల్లా అధ్యక్షులకు చెప్పినట్లు వివరించారు. సమావేశంలో పార్టీ నాయకుడిగా ఎలా పనిచేయాలో తాను చెప్పినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ డిపాజిట్ కోల్పోవడంతో ఈ విషయాన్ని పెద్దదిగా చేసి వివాదాస్పదం చేస్తోందని ధ్వజమెత్తారు. హిందూ దేవుళ్లు మూడు కోట్ల మంది ఉన్నారని? పలు సారూప్యతలు కలిగిన దేవుళ్లు ఉన్నారని తాను చెప్పానని అన్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ కూడా హిందూ సమాజం లాంటిదేనని అని పోలుస్తూ తాను వ్యాఖ్యానించానని స్పష్టత ఇచ్చారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులకు పలు కీలక అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారంపిసిసి సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో సీఎం మాట్లాడిన మాటలను కొంతమంది సోషల్ మీడియాలో వక్రీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి క్లారిటీ ఇచ్చారు. తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని ప్రధాని మోడీని కోరాను.. మీరు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుజరాత్ రాష్ట్ర అభివృద్ధికి నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ సహకరించారని తెలిపాం.. అలాగే, రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై ప్రధాని మోడీకి పలు వినతులు చేశాం.. ఆర్ఆర్ఆర్ సౌత్ ప్రాజెక్టుకు అనుమతులు, నిధులు ఇవ్వాలని ప్రధాన మంత్రిని కోరామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.





ఇక, డిసెంబర్ 8, 9న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అశ్విని వైష్ణవ్, మనోహర్ లాల్ ఖట్టర్, సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆహ్వానించారు. అలాగే, భవిష్యత్తులో తెలంగాణ అభివృద్ధి, ఆదాయ వృద్ధి లక్ష్యంగా రూపొందించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ గురించి వివరించిన ఆహ్వాన పత్రికను వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందజేశారు.

# రాహుల్‌ను విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదు

(మొదటి పేజీ తరువాయి)

రాహుల్ గాంధీది త్యాగాల కుటుంబమన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ కుటుంబం రాజకీయం చేసిందని విమర్శించారు. రాహుల్ గాంధీని ప్రశ్నించే హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. విలువలు లేని రాజకీయాలు మంచిది కాదు. కేటీఆర్‌కు నైతిక విలువలు ఉంటే రాహుల్ గాంధీ గురించి ఇంకోసారి మాట్లాడొద్దు. కాంగ్రెస్ జాతీయ పార్టీ.. భారత రాష్ట్ర సమితి ప్రాంతీయ పార్టీ. కేటీఆర్.. ఇక్కడ రాజకీయం చేయి.. సీఎం, పీసీసీ చీఫ్, మేమంతా సిద్ధం. రాహుల్ గాంధీని విమర్శిస్తే విడిచిపెట్టనని జగ్గారెడ్డి అన్నారు.



# కుప్పకూలిన రెవెన్యూ వ్యవస్థను రెండేళ్లలో పునర్నిర్మించాం

(మొదటి పేజీ తరువాయి)

విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు వచ్చే ఏడాది జనవరి నెలాఖరుకల్లా రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల సమాచారంతో కూడిన సింగిల్ పేజీ డిజిటలైజేషన్‌ను అందుబాలులోకి తీసుకువస్తామని తెలిపారు. ధరణి పోర్టల్ ద్వారా వచ్చిన యాప్‌ను పూర్తిగా తొలగిస్తామని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఎన్ఐసీ తగు కసరత్తు చేస్తోందని వివరించారు.

రాష్ట్రంలో నక్షాలు లేని 413 గ్రామాల్లో సరిహద్దుల, భూధార్ నెంబర్ల కేటాయింపు వంటి ప్రధాన అంశాలతో కూడిన సౌకర్యాలు కల్పించేందుకు ప్రయోగాత్మకంగా ఐదు గ్రామాలను ఎంపిక చేసి పని పూర్తి చేశామని ఆయన వివరించారు. ఈ ఐదు గ్రామాలకు భూదార్ కార్డులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. మిగిలిన 408 గ్రామాల్లో పట్టణ ప్రాంతాలు మినహా 373 గ్రామాల్లో రెండవ విడత కింద సర్వే నిర్వహిస్తామన్నారు. మూడవ విడతగా అన్నిజిల్లాల్లోనూ జిల్లాకు 70 గ్రామాలను ఎంపిక చేసి భూదార్ కార్డులు అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఇంతవరకు భూ సమస్యలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులలో అర్హత కలిగిన వాటిని జనవరి నెలాఖరు కల్లా పరిష్కరిస్తామని, ఆ తర్వాత ట్రిబ్యునల్స్‌ను ఏర్పాటు చేస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. అదేవిధంగా గత ప్రభుత్వ హయాం నుంచి చోటుచేసుకున్న అక్రమాలను వెలికితీసేందుకు గాను ఇంతవరకు రెండు జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ జరుగుతోందని, వాటి ఫలితాలను గమనించి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసి అక్రమార్కుల భరతం పడతామని హెచ్చరించారు. గత పది సంవత్సరాలలో ఆనాటి పాలకుల స్వార్ధపూరిత నిర్ణయాల వల్ల విధ్వంసమైన, కుప్పకూలిన రెవెన్యూ వ్యవస్థను గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి మార్గదర్శకంలో రెండేళ్లలో సామాన్యులకు రెవెన్యూ సేవలను చేరువ చేశామని పొంగులేటి తెలిపారు. భూ హక్కుల నుంచి రిజిస్ట్రేషన్ల వరకు ప్రతి పౌరుడికి మేలు జరిగేలా రెవెన్యూ వ్యవస్థలో సంస్కరణలు చేపట్టి అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ధరణీ దరఖాస్తులకు మోక్షం కల్పించాం. అధికారం చేపట్టిననాటికి 2.45 లక్షల ధరణీ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ తర్వాత మరో నాలుగు లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటన్నింటినీ పరిష్కరించి ప్రజల సంతృప్తికి తొలి అడుగు వేశాం. ధరణి పోర్టల్ బాధ్యతలను ప్రభుత్వ సంస్థలకు అప్పగిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ధరణి పోర్టల్ నిర్వహణను టెరాసిస్ అనే విదేశీ సంస్థ నుంచి కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఐసికి అప్పగించడం జరిగింది. ఈ నిర్ణయం వల్ల తెలంగాణ రైతుల కోటీ 56 లక్షల ఎకరాల భూమి వివరాలు ఇప్పుడు సురక్షితమైన స్వదేశీ సంస్థ పరిధిలోకి వచ్చాయి. రాష్ట్రంలో రెవెన్యూ సేవలను సరళీకృతం చేయడం, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు దశల వారీగా భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగింది. అధికారులే ప్రజల వద్దకు వెళ్లి సమస్యలపై దరఖాస్తులను తీసుకోవడం జరిగిందని పొంగులేటి చెప్పారు. ఏప్రిల్ 17వ తేదీ నుంచి జూన్ 20వ తేదీ వరకు మూడు విడతలుగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించగా దాదాపు 9 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయని మంత్రి పేర్కొన్నారు. వీరందరికీ నోటీసులు జారీ చేసి దరఖాస్తులు పరిష్కరిస్తున్నామని అన్నారు. అధికారంలోకి వస్తే గ్రామాలలో రెవెన్యూ వ్యవస్థను పునరుద్దరిస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకొని 10,954 రెవెన్యూ గ్రామాలను క్లస్టర్ వారీగా విభజించి జీపీవోలను నియమించామని వివరించారు. అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చుకునే ప్రక్రియలో ఖాళీగా ఉన్న సర్వేయర్ పోస్టులను భర్తీకి చర్యలు చేపట్టడంతోపాటు లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చాం. భూవిస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి 6గురు లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తున్నాం. ఇప్పటికే దాదాపు నాలుగు వేల మందికి శిక్షణ ఇచ్చి లైసెన్స్‌లు జారీ చేశాం. డిసెంబర్ నెల నుంచి మరో మూడు వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చి గంటల తరబడి చెట్లకింద నిరీక్షించే పరిస్థితికి స్లాట్ బుకింగ్ ద్వారా తెరదించాం. రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మూడు దశల్లో ఈ స్లాట్ బుకింగ్‌ను ప్రవేశపెట్టడమేగాక ఆధార్ ఈ సంతకం కూడా అమలు చేసి ప్రజల డబ్బు, సమయం ఆదా చేశాం. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా కార్పొరేట్ స్థాయిలో సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను దశల వారీగా నిర్మిస్తామని వెల్లడించారు. హిల్ట్ పాలసీపై స్పందిస్తూ నోరుందని ఏదిపడితే అది మాట్లాడుతున్నారు. ఆనాడు ప్రభుత్వంలో ఎమ్ ఎ యూ డీ మంత్రిగా ఆయనకు నచ్చిన వారికి ముడుపులు చెల్లించిన వారికి ల్యాండ్ కన్వర్షన్ చేశారని పొంగులేటి విమర్శించారు. వారికి అవసరమైన ప్రాంతాలను రెసిడెన్షియల్ ప్రాంతాలుగా మార్చారు. మేం అలా చేయలేదు. పారదర్శకంగా క్యాబినెట్ తీర్మానం చేశాం. ఆనాడు కన్వర్షన్ చేసిన ల్యాండ్ వివరాల చిట్టాను విప్పుతామని హెచ్చరించారు. సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్‌కుమార్, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



# కోతులను పారదోలే వారే ఓట్లకోసం రండి

(మొదటి పేజీ తరువాయి)

విద్యుత్, నీటి కొరత వంటి సమస్యలను పరిష్కారం చేయాలని కోరతారు. అయితే.. రేగొండ మండల ప్రజలు మాత్రం ఓ విచిత్ర కోరిక కోరారు. ఆ ఊర్లో వానరాల బెడద అధికమవడంతో.. ముందుగా వాటిని తరిమేయాలని సర్పంచ్ అభ్యర్థులను వేడుకుంటున్నారు. కోతులను ఊరి నుంచి దాటించాకే ఓట్ల ప్రచారం కోసం రండి.. లేదంటే ఓట్లు అడగవద్దని బహిరంగంగా పోస్టర్ కూడా వేశారు. ఆ పోస్టర్లో ఇంకా ఏముందంటే... 'మా ఓటును అమ్మేది లేదు.. కోతులను తరిమి ఓట్లు అడిగేందుకు రండి. ప్రలోభాలకు లొంగి ప్రజాస్వామ్యాన్ని కూనీ చేయొద్దు. వజ్రాయుధం లాంటి ఓటుతో గ్రామీణాభివృద్ధికి బాటలు వేద్దాం. ఊరంతా వానరాల దాడుల్లో గాయాలైన బాధితులే. పత్తి, వరి, మిరప పంటలు.. కోతుల చేష్టలతో ఇంటికి చేరడం లేదు. రేగొండ మండల కేంద్రమైన మా గ్రామంలో పెద్ద సార్లు, పెద్ద పెద్ద లీడర్లు తిరుగుతున్నా.. మా గోడును పట్టించుకునే నాథుడే లేకుండాపోయారు. ఎన్నికల వేళ మా ఇల్లు తొక్కే నాయకుల్లారా.. కోతులను తరిమి ఎన్నికకు ముందే అభివృద్ధికి శ్రీకారం చుట్టి.. మీ చిత్తశుద్ధిని చాటుకోండి.' అని స్థానిక ఇన్‌స్పైర్ యూత్ అసోసియేషన్ తరఫున ఓ పోస్టర్‌లో రాసిపెట్టి అందరికీ కనిపించేలా వీధిలో గోడకు అతికించారు. రేగొండలో గోడకు అతికించిన పోస్టర్ ప్రస్తుతం.. ఈ ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దీన్ని బట్టి ఆ ఊరి ప్రజలు కోతుల ద్వారా ఎంతగా ఇబ్బందులకు గురవుతున్నారో అర్థమవుతోందని నెట్టింట చర్చించుకుంటున్నారు. వారి న్యాయబద్ధమైన కోరికను నెరవేర్చి సర్పంచ్ అభ్యర్థులు చిత్తశుద్ధి చాటుకోవాలని పలువురు కోరుతున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో విడతకు నామినేషన్ల గడువు మంగళవారంతో ముగిసింది. 193 మండలాల్లోని 4,332 గ్రామ పంచాయతీలు 38,342 వార్డులకు సంబంధించిన నామినేషన్లను స్వీకరించారు. రెండో విడత నామినేషన్లను బుధవారం పరిశీలిస్తారు. డిసెంబర్ 6న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. అదే రోజు పోటీకి అర్హులైన అభ్యర్థుల జాబితాను వెల్లడిస్తారు. రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ఈనెల 14న జరగనున్నాయి. ఆరోజు మధ్యాహ్నం తర్వాత కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను ప్రకటించనున్నారు.




# త్వరలోనే మరో 40వేల ఉద్యోగాల భర్తీ

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం హుస్నాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.262.68 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.ఇచ్చిన హామీ మేరకు త్వరలో మరో 40వేల ఉద్యోగాల భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. శ్రీకాంతాచారి స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 60వేల ఉద్యోగాలు ఇచ్చాం. ప్రజాపాలన రెండున్నరేళ్లు పూర్తయ్యేలోగా లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తాం అన్నారు. పనిచేసే వాడిని, మంచోడిని గ్రామ సర్పంచ్ గా ఎన్నుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. వీలైనంత వరకు సర్పంచ్‌లను ఏకగ్రీవం చేసుకోవాలని సూచించారు. పొంకనాలు కొట్టే వాడిని సర్పంచ్ గా ఎన్నుకోవద్దని చెప్పారు. ఎడ్యుకేషన్,ఇరిగేషన్ పై మా ప్రభుత్వం దృష్టి పెట్టింది. నెహ్రూ స్ఫూర్తితోనే మేం ముందుకెళ్తున్నాం. లక్ష కోట్లు పెట్టి కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయ్యింది. ఆనాడు ఎస్ఆర్ఎస్పీని నెహ్రూ కడితే ఇప్పటికీ చెక్కు చెదరలేదు. ఆనాడు కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులే దేశానికి సేవలు అందిస్తున్నాయి. రూ.2 లక్షల రుణామాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం మాదే. వ్యవసాయం దండగ కాదు.. పండగ చేసి నిరూపించాం. లక్షా 4 వేల కోట్లు రైతుల కోసం మా ప్రభుత్వం ఖర్చు చేసింది. మహిళలకు ఫ్రీ బస్సులే కాదు..బస్సు ఓనర్లను చేశాం. సోలార్ పవర్ ప్లాంట్లను ఆడబిడ్డలకు అప్పగించాం. అడిగిన ప్రతీ పేద ఇంటికి రేషన్ కార్డు ఇచ్చాం. ఆనాడు దొడ్డు బియ్యం ఇస్తే పశువులకు దాణ పెట్టేవాళ్లు. మా ప్రభుత్వం వచ్చాక సన్నబియ్యం ఇస్తున్నాం. ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లునిర్మిస్తున్నాం. హుస్నాబాద్ లో దేవుళ్లేమైనా పాలించారా?. హుస్నాబాద్లో గౌరెల్లి రిజర్వాయర్ ఎందుకు పూర్తి కాలేదు. పదేండ్లు హుస్నాబాద్ నిర్లక్ష్యానికి గురైంది. గౌరెల్లి రిజర్వాయర్లు పూర్తి చేసే భాద్యత నాది. ఆనాడు సిద్దిపేట, సిరిసిల్ల ,గజ్వేల్ నియోజకవర్గాలే అభివృద్ధి అయ్యాయి. ఐటీఐ కాలేజీలన్నింటిని ఏటీసీలుగా మార్చాం. ఏటీసీలో చేరే ప్రతి విద్యార్థికి నెలనెలా రూ.2వేలు ఇస్తున్నాం. అని రేవంత్ అన్నారు.సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ హుస్నాబాద్ నుంచే.. బహుజనులు దండు కట్టి ఉద్యమించారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమం ఇక్కడి నుంచే ఉవ్వెత్తున ఎగసిపడిరదని గుర్తుచేశారు. 2004లో కరీంనగర్ గడ్డ నుంచే తెలంగాణ ఇస్తానని ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ మాట ఇచ్చి నిలబెట్టుకున్నారని చెప్పుకొచ్చారు. 2014లో స్వరాష్ట్ర ఆకాంక్షను సోనియాగాంధీ నెరవేర్చారని

వ్యాఖ్యానించారు. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తున్నామని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో నిధులు ఎక్కువగా ఇచ్చారని.. మిగిలిన ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. హుస్నాబాద్‌కు పదేళ్లు నిధులెందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు ఎన్ని నిధులైనా ఇచ్చి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో లాగా హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చేయబోనని చెప్పుకొచ్చారు. గత పదేళ్లలో ఎవ్వరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా అలస్వతం ప్రదర్శించారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఎస్ఆర్ఎస్పీ ఎలా ఉందో?.. బిఆర్ఎస్ కట్టిన కాళేశ్వరం ఎలా ఉందో ప్రజలు ఆలోచించాలి. దేశంలో అత్యధికంగా వరిని పండిరచేది మన రాష్ట్రంలోనే. వ్యవసాయం అంటే దండగ కాదు.. పండగ అని చేసి చూపించింది మన ప్రభుత్వమే. రాష్ట్రంలో రైతుల కోసం రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు పెట్టాం. రాష్ట్రంలో వందలాది బస్సులకు ఆడబిడ్డలు యజమానులు అయ్యారు. 3.10 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. రూ.22,500 కోట్లు పేదల ఇళ్ల కోసం ఖర్చు చేస్తున్నాం. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో మొదలు పెట్టిన ప్రాజెక్టులు అన్నీ పూర్తయ్యాయి. కానీ, హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరెల్లి ప్రాజెక్టు ఇంకా పూర్తి కాలేదు. గత పాలకుల మాదిరిగా హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చెయ్యం. త్వరలో గౌరెల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తాం అని సీఎం ప్రకటించారు. సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ లో రూ. 262.78 కోట్లతో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ. 44.12 కోట్లతో హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 45.15 కోట్లతో హుస్నాబాద్‌లోం□అ ఏర్పాటుతో పాటు రూ. 20 కోట్లతో హుస్నాబాద్ మునిసిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే, రూ. 8.60 కోట్లతో ఖిం యూనిట్ ఆఫీస్‌కు శంకుస్థాపన చేశారు. ఇక, రూ. 86 కోట్లతో హుస్నాబాద్ అర్బన్`కొత్తపల్లి ప్యాకేజీ`1లో భాగంగా 4 లైన్ల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేయగా.. రూ. 58.91 కోట్లతో హుస్నాబాద్` అక్కన్నపేట నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, శ్రీధర్‌బాబు తదితరులు సభలో పాల్గొన్నారు..









తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ · తెలుగు దిన పత్రిక
గురువారం - 04 - డిసెంబర్ 2025







# డివైడర్‌ను ఢీకొట్టిన కారు..

## ముగ్గురు యువకులు మృతి

- గాయపడిన వారిని సత్తుపల్లి హాస్పిటల్ కు తరలించిన పోలీసులు

**సత్తుపల్లి, డిసెంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** బుధవారం తెల్లవారుజామున TG 04 A 4744టాటా ఆల్ట్రోజ్ కారులో వియం.బంజర్ వైపు నుండి సతుపల్లి వెళ్తు కిష్టారం గ్రామం, అంబేద్కర్ కాలనీ వద్ద రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టిన ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు సత్తుపల్లి కొంపల్లి కాలనీ చెందిన విద్యార్థులు సిద్దెసి జయ్ (18సం) మార్సకట్ల శశి, (11సం) చంద్రుగొండ మండలం, మహబూబ్ నగర్ చెందిన సాజిద్ (25 సం)అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు యువకులు తలారి అజయ్, ఇమ్రాన్ లకు తీవ్ర గాయాలు కావడంతో సమాచారం తెలుసుకున్న స్థానిక సత్తుపల్లి ఇన్స్పెక్టర్ శ్రీహరి, పోలీసులు ఘటన ప్రాంతానికి చేరుకొని క్షతగాత్రులను సత్తుపల్లి హాస్పిటల్ కు తరలించి బాధిత కుటుంబాలకు సమాచారం అందించారు. ప్రమాదానికి సంబంధించి విచారణ జరుపుతున్నట్టు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు.



# అయ్యప్ప స్వామి మహా పడిపూజలో పాల్గొన్న కార్పొరేటర్ బన్నాల



**చిల్కానగర్, డిసెంబర్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** చిల్కానగర్ డివిజన్ బొడ్రాయి ప్రాంతంలో అంజయ్య గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎద్దుల కొండల రెడ్డి, కోకొండ జగన్, రామాంజనేయులు, ఫోటో బాలు, ముధం శ్రీనివాస్ యాదవ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ అయ్యప్ప మాలధారణ చేసిన భక్తుల నియమాచరణ, సేవాభావం ఎంతో గొప్పదని అభినందించారు. చిల్కానగర్ ప్రాంతంలో భక్తి, సేవా కార్యక్రమాలకు ఎల్లప్పుడూ తాను సహకారం అందిస్తానని తెలిపారు.





# బాలాజీ ఎంక్లేవ్ పార్కులో బోర్ పనులకు శంకుస్థాపన చేసిన కార్పొరేటర్ బన్నాల

**చిల్కానగర్, డిసెంబర్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** బాలాజీ ఎంక్లేవ్ ఉద్యానవనంలో నూతన వాటర్ బోర్ పనులకు కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ శంకుస్థాపన చేశారు. చిల్కానగర్ డివిజన్‌లో పార్కు అభివృద్ధి కార్యక్రమాల భాగంగా కొబ్బరికాయ కొట్టి బోరు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ “ఇటీవల ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా పార్కు ఇనాగురేషన్ జరిగిన తర్వాత మిగిలిన వసతుల పనులను వేగవంతం చేస్తున్నాం. వీలైనంత త్వరలో కాంట్రాక్టర్‌తో కలిసి పార్కులో అన్ని సౌకర్యాలు పూర్తి చేసి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకొస్తాం” అని అన్నారు.పార్కు అభివృద్ధికి బాలాజీ ఎంక్లేవ్, రాఘవేంద్ర నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సహకరించడాన్ని ఆమె అభినందించారు.కార్యక్రమంలో పాల్గొన్నవారు:బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, బాలాజీ ఎంక్లేవ్ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, ఓంకార్ సింగ్, రమణ గుప్తా, శంకర్, రాఘవేంద్ర నగర్ కాలనీ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, యాకూబ్ రెడ్డి, రాఘవేంద్ర నగర్2 అధ్యక్షులు ప్రొఫెసర్ రాములు, అడ్వకేట్ శ్రీనివాస్, నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, శ్యామ్, ఆర్టికల్చర్ సూపర్వైజర్ బాలు తదితరులు.





# ఎన్నికల ఏర్పాట్లకు స్కూల్ బస్సుల సహకారం.!

- సత్తుపల్లి రవాణా శాఖ అధికారుల సమావేశం
- మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జె.ఎన్. శ్రీనివాసరావు

**సత్తుపల్లి, డిసెంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా స్కూల్ బస్సులను అందుబాటులో ఉంచాలని రవాణా శాఖ అధికారులు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలను కోరారు. ఈనెల 17న జరిగే మూడవ విడత ఎన్నికల కోసం అవసరమైన రవాణా ఏర్పాట్లపై బుధవారం సత్తుపల్లి ప్రాంతీయ రవాణా కార్యాలయంలో సమావేశం జరిగింది. సత్తుపల్లి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ (వాహనాల నోడల్ అధికారి) జె.ఎన్. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎం.వి.ఐ రాజశేఖర్, ఏ.ఎం.వి.ఐ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. సత్తుపల్లి, పెనుబల్లి, వేంసూరు, కల్లూరు, తల్లాడ, ఏన్కూరు, సింగరేణి మండలాలకు చెందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు హాజరయ్యారు. ఈ మండలాల్లో కలిపి సుమారు 160 స్కూల్ బస్సులు ఉన్నట్లు అధికారులు వివరాలు సేకరించారు. పోలింగ్ సిబ్బంది, సామాగ్రి తరలింపునకు 16, 17 తేదీల్లో ఈ బస్సులను సిద్ధంగా ఉంచాలని శ్రీనివాసరావు కోరారు.
తమదైన బాధ్యతగా భావిస్తూ ఎన్నికల నిర్వహణకు పూర్తిగా సహకరిస్తామని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రైవేటు విద్యాసంస్థల సంఘ నిర్వాహకులు నాయుడు వెంకటేశ్వరరావు, పసుపులేటి నాగేశ్వరరావు, ఇస్మాయిల్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**నాచారం, డిసెంబర్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి నాచారం డివిజన్‌లో రూ. 1.85 కోట్ల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగంగా ఈ పనులు ప్రారంభించామని ఎమ్మెల్యే తెలిపారు.ప్రారంభించిన పనుల్లో అన్నపూర్ణ కాలనీ రోడ్ నం.లో సీసీ రోడ్ (₹30 లక్షలు), ఇంద్రనగర్ 1వ ఎడమ వీధి సీసీ రోడ్ (రూ 30 లక్షలు), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పక్క లేన్ సీసీ రోడ్ (రూ 37 లక్షలు), స్నేహపురి కాలనీ పార్కు ఫెన్సింగ్ (రూ 20 లక్షలు), శ్రీనగర్ కాలనీ పార్కు ఫెన్సింగ్ పనులు (రూ 10 లక్షలు), బాబానగర్ ప్రాంతంలోని రెడ్డి సమాధి వాటిక అభివృద్ధి పనులు (రూ 58.5 లక్షలు) ఉన్నాయి.ఈ కార్యక్రమంలో డిఈ బాలకృష్ణ, ఏఈ వినీత్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సదాశినిపాలెంలో బీఆర్ఎస్ సర్పంచ్ నామినేషన్ దాఖలు



**సత్తుపల్లి, డిసెంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి మండలం సదాశినిపాలెం గ్రామానికి బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా దుబ్బాక చందు, యశోద దంపతులు అధికారికంగా నామినేషన్ పత్రాలు ఎన్నికల అధికారికి సమర్పించారు.
నామినేషన్ దాఖలు కార్యక్రమానికి గ్రామ బీఆర్ఎస్ నాయకులు కల్నేని వెంకటేశ్వరావు, దామోదర్ రెడ్డి, సూర్యప్రకాశ్ రెడ్డి, పర్స కృష్ణ భద్రం, శివకృష్ణ, కల్నేని శ్రీను, ఆళ్ల రమేష్, వెంకటరామయ్య, సాంబశివరావు, మామిళ్ల వెంకటేశ్వరావు, సుజాత, కృష్ణవేణి తదితర నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

# బిఆర్ఎస్వి నూతన కమిటీకి కార్పొరేటర్ బన్నాల శుభాకాంక్షలు



**చిల్కానగర్, డిసెంబర్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గంలోని ఉప్పల్ సర్కిల్ బిఆర్ఎస్విలో నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, కార్యదర్శి తదితర కమిటీ సభ్యులకు చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మాట్లాడిన కార్పొరేటర్ గీతా ప్రవీణ్, బిఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్ గౌడ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు వినయ్‌కుమార్ యాదవ్, కార్యదర్శి వరుణ్ గౌడ్, ఉపాధ్యక్షుడు చంద్రధర్ మరియు ఇతర కమిటీ సభ్యుల ఎన్నుక ఎంతో శుభపరిణామం అని అభివర్ణించారు. పార్టీ కోసం అంకిత భావంతో పనిచేస్తే తప్పకుండా తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్వి జిల్లా కమిటీ సభ్యులు హేమ నాథ్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు అభినవ్, సుజిత్, సాయి పాల్గొన్నారు.

గురువారం - 04 - డిసెంబర్ 2025

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక





# దుర్గామాత దేవాలయం నవమ బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న నెమలి అనిల్

**మల్లాపూర్, డిసెంబర్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** మల్లాపూర్ డివిజన్ కే.ఎల్. రెడ్డి నగర్ కాలనీలోని శ్రీ దుర్గామాత దేవస్థానంలో నవమ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య నిర్వహించబడుతున్నాయి. బుధవారం జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ హాజరై అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.అనంతరం దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో దేవస్థాన కమిటీ సభ్యులు, కే.ఎల్. రెడ్డి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి నిండిన వాతావరణాన్ని సృష్టించారు.





# గ్లోబల్ సమ్మిట్ బందోబస్త్ ఏర్పాట్లను సమీక్షించిన ఏడీజీ మహేష్ భగవత్ ఐపీఎస్

**మహేశ్వరం, డిసెంబర్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** రంగారెడ్డి జిల్లా, కందుకూర్ మండలం ఫ్యూచర్ సిటీ ఫ్యూచర్ సిటీలో నిర్వహించబోయే గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్ ఐపీఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ విభాగాధికారులతో సమావేశమై ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష చేపట్టారు.రాచకొండ సీపీ సుధీర్ బాబు ఐపీఎస్, ఐజీపీ రమేష్ రెడ్డి ఐపీఎస్‌తో కలిసి మహేష్ భగవత్ సమ్మిట్ జరగనున్న ప్రాంగణాన్ని సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ సమ్మిట్ సందర్భంగా బందోబస్త్ విషయంలో ఎటువంటి లోపం చోటుచేసుకోకుండా అధికారులు పరస్పర సమన్వయం తో పని చేయాలని ఆదేశించారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ సమ్మిట్‌లో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్, అక్టోపస్, గ్రేహౌండ్స్, డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ వంటి విభాగాలతో కలిపి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్టు తెలిపారు. సమ్మిట్‌కు హాజరయ్యే అంతర్జాతీయ పెట్టుబడి సంస్థలు, బహుళజాతి కంపెనీలు, పారిశ్రామిక దిగ్గజాల ప్రతినిధులు కలిసి సుమారు 600 మంది డెలిగేట్లు పాల్గొననున్నట్టు అధికారులు వివరించారు. వీరికి మూడంచెల భద్రత కల్పించనున్నారు.సమ్మిట్ ప్రాంగణంలో వెయ్యికి పైగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి సెంట్రల్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానించనున్నారు. ట్రాఫిక్ నిర్వహణ కోసం వెయ్యి మంది ట్రాఫిక్ పోలీసులు, అదనంగా ట్రాఫిక్ మార్షల్‌స్‌ను నియమించనున్నారు. రహదారుల మళ్లింపు, బారికేడ్ల ఏర్పాటు, వాహన పార్కింగ్ నిర్వహణ వంటి ఏర్పాట్లు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.సమ్మిట్ రోజుల్లో సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఆయా మార్గాల్లో ప్రత్యేక రూట్ డైవర్షన్లు అమలు చేసి పటిష్టమైన పోలీసు బందోబస్తును అమలు చేయనున్నట్టు అధికారులు తెలిపారు.






# ఆరోగ్యానికి ఐదు సూత్రాలు

**పిల్లల ఆరోగ్యం పై నిర్వహించిన అవగాహన సదస్సులో డాక్టర్ కె వి కృష్ణారావు**

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 3, తెలంగాణ ముచ్చట్లు;** టేకులపల్లి గురుకులంలో న్యూ లక్ష్య స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. సంస్థ అధ్యక్షులు గరిడేపల్లి సత్యనారాయణ అధ్యక్షతన పిల్లల ఆరోగ్యం పై అవగాహన సదస్సు జరిగింది.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ కె వి కృష్ణారావు పాల్గొని ప్రసంగించారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే 5 సుత్రాలు పాటించాలిఅన్నారు. ఈ 5 సుత్రాలు సమతుల్య ఆహారం , ప్రశాంతమైన నిద్ర , శారీరక శ్రమ , పరిశుభ్రత , వినోదం అని అయన పేర్కొన్నారు. సమతుల్య ఆహారం అంటే విటమిన్లు , మినరల్స్ , పీచు పదార్థాలు , పిండి పదార్థాలు , మాంసం కృతులు , కొవ్వు పదార్థాలు సమపాళ్ళలో ఉండాలన్నారు. పిల్లల ఎదుగుదలకు మూడు రకాల ఎలిమెంట్స్ అవసరం అని ఆయన తెలిపారు. ఐరన్ , క్యాల్షియం , జింకు . యాపిల్ గాని బెల్లం గాని ఖర్జూర పండ్లు , పాలకూర , మటన్ , బీట్రూట్ , మునగాకు , కిస్ మిస్ లు లాంటివి తీసుకుంటే ఐరన్ వస్తుంది అయన అన్నారు. నువ్వులు , తమలపాకులు , రాగిజావ లాంటివి తీసుకుంటే క్యాల్షియం లభిస్తుంది అయన పేర్కొన్నారు. బూడిద గుమ్మడికాయ గింజలు , సన్ఫ్లవర్ గింజలు , పల్లీలు తినడం వల్ల జింకు వస్తది ఆయన తెలిపారు. ఇటువంటి పదార్థాలు తీసుకోవడం వల్ల చాలా వరకు జబ్బులు రాకుండా ఉంటాయని అయన అన్నారు . కావున పిల్లలకు రాగి జావను మజ్జిగలో గానీ బెల్లం వేసి తాపించాలి అని అయన తెలిపారు . నువ్వులు బెల్లం ఉండలు కలిపి తింటే ఐరన్ ఐరన్ మరియు క్యాల్షియం వస్తాయన్నారు. ప్రశాంతమైన నిద్ర అంటే పిల్లలు 6 నుంచి ఎనిమిది గంటలు విధిగా నిద్ర పోవాలి అని అయన తెలిపారు. దీనివలన బాడీ అంతా రిపేర్ అయి రోగ నిరోధక శక్తి పెరిగి ఎటువంటి జబ్బులు రాకుండా ఉండటానికి దోహదపడుతుంది వివరించారు. శారీరక శ్రమ అంటే పిల్లలు ఉదయం పూట ప్రతిరోజు ఎండలో ఒక గంట సమయాన్ని కేటాయించి వాకింగ్ , రన్నింగ్ , సైక్లింగ్ , యోగ లాంటి వ్యాయామలు చేయాలన్నారు. దీనివలన శరీరం రిలీఫ్ అయ్యి హ్యాపీ హార్మోన్స్ విడుదల అయి మానసికమైన ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు . విటమిన్ డి వలన రోగ నిరోధక శక్తి పెరిగి ఎటువంటి జబ్బులు రాకుండా ఉండటానికి దోహద పడుతుంది చెప్పారు. పరిశుభ్రత లో వ్యక్తిగత పరిశుభ్రత , పరిసరాల పరిశుభ్రత లు ఉంటాయన్నారు . వ్యక్తిగత పరిశుభ్రత అంటే శరీరానికి శుభ్రంగా ఉంచుకోవడం , గోర్లు కత్తిరించుకోవడం . ఎప్పటికప్పుడు చేతులను హ్యాండ్ వాష్ తో శుభ్రంగా కడుక్కోవడం వల్ల చాలా రకాల జబ్బులు రాకుండా చూసుకోవచ్చు అని వివరించారు. పరిసరాల పరిశుభ్రత లో ఇంటి చుట్టు పక్కల పిచ్చి మొక్కలు , వేస్ట్ నీరు నిలవ లేకుండా చేయడం వల్ల దోమలు ఉండవు . దాని వలన మలేరియా , బోదకాలు , డెంగు లాంటి జబ్బులు రాకుండా ఉంటాయి తెలియజేశారు. వినోదం అంటే పిల్లలను సంతోషం పరిచే సినిమాలు , టీవీలలో కార్యక్రమాలు గాని , కామెడీ దృశ్యాలు పిల్లలు చూడటం వల్ల ఆహ్లాదము సంతోషం కలిగి మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు అని ఆయన అన్నారు. దీంట్లో భాగంగా పిల్లలను అప్పుడప్పుడు పార్కు మరియు టూర్లకు తీసుకుని పోవడం వలన వాళ్ల మానసిక ఆరోగ్యం మెరుగు అవుతుంది . అలాగే డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్త వహించాలి ఆయన హెచ్చరించారు. హాస్టల్లో ఉన్న పిల్లలకు ఎక్కువ శాతం ఎలర్జీ వస్తది కావున గజ్జి తామర రాకుండా ఉండాలంటే తడి దుస్తులు ధరించకూడదు . కావున పొడి దుస్తులు ధరించాలి అని తెలిపారు. ఒకవేళ వ్యాధులు వస్తే వెంటనే చర్మవ్యాధుల డాక్టర్ ను సంప్రదించాలని అన్నారు . ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం సునీత , వైస్ ప్రిన్సిపాల్ ఏ రీనాధారిదేవి , జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ డి స్వప్నలత , & కే శైలజ , దొడ్డ శ్రీనివాస్ రెడ్డి మరియు టీచింగ్ స్టాఫ్ స్టూడెంట్స్ తదితరులు పాల్గొన్నారు .




# పెద్దమందడి బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరిక

**పెద్దమందడి,డిసెంబర్03(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల కేంద్రానికి చెందిన సూర గోపాల్, సూర కృష్ణయ్య, సూర రంగన్న, దశరథం లు స్థానిక కాంగ్రెస్ నాయకులు సత్యరెడ్డి, సత్యనారాయణ, సూర ప్రభాకర్ ఆధ్వర్యంలో పార్టీ పట్టుదలతో కాంగ్రెస్‌లోకి అడుగుపెట్టారు.వీరికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి గారు వనపర్తిలోని తన నివాసంలో కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. బిఆర్ఎస్ తరపున సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేసి, అనంతరం నామినేషన్ ఉపసంహరించుకుని కాంగ్రెస్ పార్టీలో చేరిన రంగన్నను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.ప్రస్తుతం కొనసాగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను అఖండ మెజారిటీతో విజయం సాధించేలా కృషి చేయాలని ఎమ్మెల్యే నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, వేణుగోపాలకృష్ణ, మాజీ సర్పంచ్ వెంకటస్వామి, మాజీ ఎంపిటిసి బుచ్చన్న, న్యాయవాది త్రినాథ్, టైలర్ రవి, రామాంజనేయులు పాల్గొన్నారు.




# పెద్దమందడి బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరిక

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 3, తెలంగాణ ముచ్చట్లు:** ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. కేంద్రంలోని ఆటో స్టాండ్ వద్ద డ్రైవర్లకు పలు అంశాలపై ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు.ఆటోలో ఎక్కువ మందిని ఎక్కించుకోవద్దని, డ్రైవర్ సీటు పక్కన ప్రయాణికులు కూర్చోరాదని అన్నారు. ఆటోను కండిషన్‌లో ఉంచుకునేలా చూసుకోవాలన్నారు. ఎక్కడైనా ప్రమాదం జరిగితే వారిని ఫస్ట్ ఎయిడ్ నిమిత్తం ఆసుపత్రులకు తరలించి మానవత్వం చూపించాలన్నారు. ఆటోలకు హైఓల్టేజీ బల్బులు అమర్చి ఎదురుగా వచ్చే వారికి ఇబ్బందులు కలిగించవద్దన్నారు. ప్రయాణికులు ఇబ్బందులకు గురైతే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, ఆటో డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# దామెర గ్రామ రాజకీయాల్లో కీలక పరిణామం

**కాంగ్రెస్ మాజీ గ్రామ అధ్యక్షుడు సాతురి ప్రభాకర్ బీజేపీలో చేరిక**

**ఎల్కతుర్తి, డిసెంబర్ 03(తెలంగాణ ముచ్చట్లు) :** ఎల్కతుర్తి మండలంలోని దామెర గ్రామంలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో గ్రామ రాజకీయాల్లో విశేష మార్పు చోటుచేసుకుంది. దామెర గ్రామ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సాతురి ప్రభాకర్ భారతీయ జనతా పార్టీలో చేరడం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

బీజేపీ మండల అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి సాతురి ప్రభాకర్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామ అభివృద్ధి, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని బీజేపీ చేస్తున్న కృషి, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు తనను ఆకట్టుకోవడంతోనే పార్టీలో చేరినట్లు ప్రభాకర్ తెలిపారు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ బలపడేందుకు ప్రభాకర్ చేరిక కీలక పాత్ర పోషించనుందని పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు. దామెర గ్రామంలో బీజేపీ శక్తివిస్తరణకు ఇది పెద్ద అవకాశమని వారు భావిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో దామెర శక్తికేంద్ర ఇంచార్జ్ ఠాకూర్ శామ్ సింగ్, మాజీ సర్పంచ్ చల్ల రవీందర్ రెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షులు అంబీర్ శ్రీనివాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.



## 200వ జ్ఞానమాల కార్యక్రమానికి వజ్రష్ యాదవ్‌కు ఆహ్వానం

**కీసర, డిసెంబర్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** కీసర మండల అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 07వ తేదీన నిర్వహించనున్న 200వ వారం జ్ఞానమాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రష్ యాదవ్‌ను ఆహ్వానించారు.అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్ ప్రత్యేకంగా ఆహ్వానం అందజేశారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బలిదే రమేష్ గుప్తా, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్ బక్కని నర్సింగ్ రావు, గోధుమకుంట మాజీ ఎంపీటీసీ మంచాల ప్రవీణ్ కుమార్, కీసర మాజీ ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్ శర్మ, అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు బక్కని కుమార్, సంయుక్త కార్యదర్శి కట్ట శంకరయ్య, మాజీ ఉపాధ్యక్షులు బంటు శ్రీనివాస్, కానుకుర్తి ఋషిక్ తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ భావజాలాన్ని ప్రజల్లో విస్తరించేందు కు కొనసాగుతున్న జ్ఞానమాల కార్యక్రమం 200వ వారానికి చేరుకోవడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



## పొగమంచులో వాహన ప్రయాణం ప్రమాదకరం

**పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 3, తెలంగాణ ముచ్చట్లు;** దట్టమైన పొగమంచు సమయాల్లో వాహన ప్రయాణం ప్రమాదకరమని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు నివారించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు.

బుధవారం తెల్లవారుజామున సత్తుపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందారని, పొగమంచు కారణంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల దృష్టిలో పెట్టుకొని స్వల్ప నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని అన్నారు. పొగమంచు కారణంగా రోడ్లపై ఎదురుగా వచ్చే వాహనదారులు పాదచారులను గమనించే సామర్థ్యం గణనీయంగా తగ్గి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా వాహనాలను వేగంగా నడపకూడదని, ముందుగా వాహన పరిస్థితిని తనిఖీ చేసుకోవాలని, డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ మాట్లాడటం, అనుకోకుండా ఓవర్‌టేక్ చేయడం, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనలు వంటి ప్రమాదకర చర్యలు పూర్తిగా నివారించాలని సూచించారు.

## నేడు విద్యుత్ సరఫరా అంతరాయం



**నాగారం, డిసెంబర్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** ఫీడర్ నిర్వహణ మరియు పీఎంఐ పనుల కారణంగా నాగారం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండనున్నట్లు కీసర విద్యుత్ ఏఈ ఎస్. మురళీ కృష్ణ తెలిపారు.ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు 11 కె.వి బండ్లగూడ ఫీడర్‌కు సంబంధించిన కె ఎస్ ఆర్ టౌన్‌షిప్, అరుంధతి కాలనీ, గౌరీ ప్రియా నగర్, సాయి రత్న కాలనీ, ప్రజాసాయి గార్డెన్ మెయిన్ రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపి వేయబడుతుంది.మధ్యాహ్నం 02:00 గంటల నుండి సాయంత్రం 05:00 గంటల వరకు 11 కె.వి కరీంగూడ ఫీడర్ (రాంపల్లి) పరిధిలోని కరీంగూడ గ్రామం, శిల్పా వెంచర్, తారక ఎన్‌క్లేవ్, కాకతీయ ఎన్‌క్లేవ్, శుభకర ఎన్‌క్లేవ్, అక్షయ ఎన్‌క్లేవ్, సాహితీ హర హర, లోటస్ కౌంటీ, సాయి కాలనీ, చంద్రా ఎన్‌క్లేవ్, రాజి రెడ్డి ఎన్‌క్లేవ్, మైత్రి సిటీ, నా కాలనీ, భగవాన్‌క్షాల్ నగర్ కాలనీ, నీలగిరి ఎస్టేట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుంది.పనులు పూర్తయ్యాక వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

## కాటాలలో నకిలీ ఫోర్జరీ చేస్తున్న ముఠా అరెస్టు

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 3, తెలంగాణ ముచ్చట్లు:** పత్తి కొనుగోలు కాటాలలో నకిలీ ఫోర్జరీ చేసిన చిప్ లను అమర్చి రైతులను మోసం చేస్తున్న ముఠాను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు కాటాలను తయారు చేస్తున్న ఆర్గనైజర్ అయిన హైదరబాద్ కు చెందిన ఓగిలి శెట్టి శంకర్, జంపాల కోటేశ్వరరావు లను అరెస్టు చేసినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో అనేకమందికి నకిలీ కటాలను సరఫరా చేస్తునట్లు గుర్తించిన తల్లాడ పోలీసులు నిందుతుల నుంచి 5 మదర్ బోర్డులు(పి సి బి) 4 చీప్ లు, రెండు కాంటాలు ఇతర పరికరాలు సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. నకిలీ కాటాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ సూచించారు.





# రైస్ మిల్లర్లు ధాన్యంలో తరుగును తీస్తే కఠిన చర్యలు

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హన్మకొండ,డిసెంబర్03(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ నేతృత్వంలో కస్టమ్ మిల్లింగ్ రైస్, ధాన్యం కొనుగోలు అంశాలపై జిల్లా కలెక్టరేట్‌లో పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశం జరిగింది.రైతులు విక్రయించిన ధాన్యంలో మిల్లర్లు అధికంగా తరుగు తీస్తున్నారని పలు కొనుగోలు కేంద్రాలలో తనిఖీల సందర్భంగా రైతులు చేసిన ఫిర్యాదులను కలెక్టర్ ప్రస్తావించారు. తరుగు కారణంగా రైతులకు నష్టం జరుగుతోందని, ఇకపై ఏ మిల్లులోనైనా తరుగు లేకుండా ధాన్యాన్ని దింపుకోవాలని సూచించారు. రైతులను ఇబ్బంది పెట్టే విధానాలు అంగీకారయోగ్యం కాదని స్పష్టం చేశారు.మిల్లర్లను ఉద్దేశించి కలెక్టర్ కేటాయించిన ధాన్య పరిమాణాలపై, నిర్దేశిత సీఎంఆర్ లక్ష్య సాధనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేటాయింపు విధానం పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, ఏ ధాన్యం కొనుగోలు కేంద్రం ఏ మిల్లుకు కేటాయించబడిందో మిల్లర్లు స్పష్టంగా తెలుసుకునేలా జాబితాలను అందజేయాలని అధికారులకు సూచించారు.

మిల్లర్లు ధాన్యం దింపిన వెంటనే ఆన్లైన్‌లో అంగీకార పత్రం అప్లోడ్ చేయాలని ఆదేశించారు. సన్న, దొడ్డు అనే భేదం లేకుండా ధాన్యాన్ని స్వీకరించాలని, 2024-25 సీఎంఆర్ లక్ష్యాన్ని వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ అధికారి ఎండి వాజిద్ అలీ, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.





# వికలాంగ అనాధ చిన్నారులకు అల్టిట్యూడ్ విద్యార్థుల చేయూత

**ఎల్కతుర్తి, డిసెంబర్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** వికలాంగ అనాథ చిన్నారుల అభ్యున్నత కోసం సేవలు అందిస్తున్న ఎస్ఆర్ఎస్ బ్లైండ్ అండ్ డెఫ్ ఖమ్మం సంస్థకు సెయింట్ థామస్ అల్టిట్యూడ్ విద్యార్థులు మానవ దృక్పథంతో 15,216 ఆర్థిక సహాయం అందించారు. స్వచ్ఛంద సేవాస్ఫూర్తితో ముందుకు వచ్చిన విద్యార్థులు తమలోని మానవతా విలువలను ప్రతిబింబిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలిచారు.

ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పుష్కూరి కార్తీక్ రావు మాట్లాడుతూ, “విద్యార్థులకు ఆటపాటలతో పాటు సేవాభావాన్ని పెంపొందించడం మా ప్రధాన బాధ్యత. అల్టిట్యూడ్ విద్యార్థులు ఎల్లప్పుడూ అద్భుతాలు సాధించడంలో ముందుంటారు. ఈరోజు చేసిన సేవా కార్యక్రమం మా పాఠశాలకు గర్వకారణం” అని పేర్కొన్నారు.

ఎస్ఆర్ఎస్ సంస్థకు విద్యార్థులు అందించిన సహాయంపై ఎల్కతుర్తి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ వారి సేవాభావాన్ని అభినందించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్, హెడ్‌మాస్టర్ లింగం మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రే తిరుపతి, ఉపాధ్యాయులు సరిత, లావణ్య, ఆశా బేగం, సురేష్, గీత, శ్రావణి, స్వప్న, శ్వేత, అనుష, మమత, కవిత, కావ్య, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.





# నామినేషన్ స్వీకరణ కేంద్రాలను సందర్శించిన కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 3, తెలంగాణ ముచ్చట్లు:** గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రాలను కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ సందర్శించారు. తల్లాడ మండలం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. నామినేషన్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తుతో నిశితంగా పర్యవేక్షించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరు ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పకుండా పాటించాలన్నారు.





# జిల్లాలో స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణ లక్ష్యంగా పోలీసు సిబ్బంది పనిచేయాలి

- **ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరగకుండా పకడ్బంది ప్రణాళికతో పోలీసు విధులు**
- **ఎన్నికల విధులు, విధివిధానాలపై పోలీస్ సిబ్బందికి అవగాహన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్**

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 3, తెలంగాణ ముచ్చట్లు;** జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంతో కూడిన నిష్పక్షపాత ఎన్నికలు జరిగేలా సమన్వయంతో పనిచేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల బందోబస్తు విధులు నిర్వహించేందుకు సిద్ధమవుతున్న పోలీస్ సిబ్బంది యొక్క ఎన్నికల విధులు, విధివిధానాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి, శాంతిభద్రతల పరిరక్షణ అంశాలపై ఖమ్మం



రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో కిసాన్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణకు లోబడి పనిచేయాలన్నారు. ఎన్నికల నియమావళిపై సమగ్ర అవగాహన ఏర్పర్చుకుని, ఎటువంటి పొరపాట్లు జరుగకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు.ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు ప్రవర్తన నియమావళి అమల్లో ఉంటుందని చెప్పారు. అప్పగించిన భాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, శాంతి భద్రతల విషయంలో కఠినంగా ఉండాలని సూచించారు. ఎన్నికల్లో డబ్బు,మద్యం ప్రభావాన్ని నిలువరించేందుకు ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంటోందని గ్రహించాలన్నారు. స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్, ఫ్లైయింగ్ స్క్వార్డ్ టీమ్స్, సరిహద్దు చెక్ పోస్టులు,రూట్ మొబైల్ పార్టీలు, ఎన్నికల ముందు, పోలింగ్ రోజు, ఓట్ల లెక్కింపు సందర్భంగా నిర్వహించే విధులలో పూర్తి అవగాహన వుండాలన్నారు. అదేవిధంగా ఎన్నికల సభలు, సమావేశాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకొవాలని సూచించారు. గ్రామాల్లో ఘర్షణ వాతావరణం లేకుండా పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరంగా చేయాలని, బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలను నియంత్రించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లా &అర్డర్ ప్రసాద్ రావు, ఏసీపీ తిరుపతి రెడ్డి, సిఐలు రాజు, మురళి, రూరల్ డివిజన్ ఎస్సైలు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: పొట్లపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## పీచరలో బీఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి అనితకు ముదిరాజ్ సంఘం మద్దతు



**వేలేరు,03డిసెంబర్(తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామంలో సర్పంచ్ పదవికి బీఆర్ఎస్ తరఫున పోటీలో ఉన్న అభ్యర్థి మరిజె అనితకు ముదిరాజ్ సంఘ నాయకులు, కార్యకర్తలు ఏకమతంగా మద్దతు ప్రకటించారు. గ్రామంలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, పీచర అభివృద్ధిని ముందుంచి అనితకు తమ సంపూర్ణ మద్దతు అందజేస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రగతిని దిశగా తీసుకెళ్లగల నాయకత్వం అవసరమైన ఈ సమయంలో బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

## అంగన్వాడీ ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్



**మేడ్చల్–మల్కాజ్గిరి, డిసెంబర్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లాలో అంగన్వాడి టీచర్లు మరియు హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటియు) కార్యదర్శి బి. శోభారాణి, కోశాధికారిణి పి.శివరాణి ఆధ్వర్యంలో అల్వాల్ ప్రాజెక్ట్ సీడీపీవోకు వినతిపత్రం అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ––జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్, హెల్పర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీల కారణంగా ఒకే టీచర్ లేదా ఒక్క ఆయాపై పనిచాపడం అధికంగా పడుతోందని, ఇది పనిచేయడంలో ఇబ్బందులు కలిగిస్తోందని పేర్కొన్నారు.అలాగే అంగన్వాడీ సెంటర్లకు సరుకులు (పప్పు, పాలు, గుడ్లు) రాత్రి 7-8 గంటలకు రావడం వల్ల వర్కర్లు ఇబ్బంది పడుతున్నారని, సరఫరాను తప్పనిసరిగా పాఠశాల టైమింగ్స్‌లో––సాయంత్రం 4 గంటల లోపు––చేయాలని వాహనదారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సరఫరా చేసే కొంతమంది వాహనదారులు అంగన్వాడీ కార్యకర్తలతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని, వారి మీద చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కి డిమాండ్ చేశారు.జిల్లాలో అంగన్వాడీ సెంటర్లకు గత ఎనిమిది నెలలుగా గది అద్దె బకాయి ఉన్నందున టీచర్లు యజమానుల ఒత్తిడికి గురవుతున్నారని, సెంటర్లు ఖాళీ చేయమని హెచ్చరికలు వస్తున్నాయని తెలిపారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న రెంట్లు విడుదల చేయాలని యూనియన్ కోరింది. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

## సాక్షి స్పెల్ బీ సెమీ ఫైనల్స్‌కి సెలెక్ట్ అయిన బోనకల్ షైన్ హై స్కూల్ విద్యార్థిని



**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 3, తెలంగాణ ముచ్చట్లు;** ఈ నెల 23వ తారీకు సాక్షి స్పెల్ బీ వాళ్ళు నిర్వహించిన ఎగ్జామ్ లో రక్షిత తన ప్రతిభ చాటుకుని, సెమీ ఫైనల్స్ కి సెలెక్ట్ అయ్యింది.. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండంట్ అన్సార్ పాషా మాట్లాడుతూ రక్షిత ని, ఆమె తల్లి దండ్రులని అభినందించారు...సాక్షి టీం కి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.. ఈ కార్యక్రమం లో కరెస్పాండంట్ అన్సార్ పాషా, డైరెక్టర్ లాల్ మహమ్మద్, ప్రిన్సిపాల్ శ్వేత, అడ్మినిస్ట్రేషన్ నాగేశ్వరావు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు..

## మణిగిల్ల గ్రామ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా గొల్ల శివకుమార్

### ఎమ్మెల్యే సహకారంతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా



**పెద్దమందడి,డిసెంబర్03(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండల పరిధిలోని మణిగిల్ల గ్రామం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గొల్ల శివకుమార్ గ్రామ ప్రజల ఆశీర్వాదాలు అందించాలని కోరారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి సహకారంతో గ్రామ అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, అవసరమైన అన్ని సేవలను సమయానికి అందించేందుకు సిద్ధంగా ఉన్నానని శివకుమార్ చెప్పారు.గ్రామంలోని పెద్దలు, మహిళలు, యువత అందరూ తనకు ఆశీర్వదించి విజయవంతం చేయాలని ఆయన అభ్యర్థించారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భర్త తిరుపతిరెడ్డి, వెంకటేష్, బాలరాజ్, సురేష్, గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ సాగు ప్రోత్సాహకానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలేంటి..?

- లోక్ సభలో కోరిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి
- జవాబిచ్చిన కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి



**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 3, తెలంగాణ ముచ్చట్లు;** రైతులు తమ పంటచేలల్లో రసాయనిక ఎరువుల వినియోగానికి బదులుగా సేంద్రియ సాగును ప్రోత్సహించేలా బయో ఇన్ పుట్ రీసెర్చ్ సెంటర్ల (బీఆర్సీ) ఏర్పాటుకు రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో తెలపాల్సిందిగా ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో కోరారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా బుధవారం ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. పరిశోధన కేంద్రాల పురోగతి వివరాలు తెలపాలన్నారు. దీనికి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖల సహాయ మంత్రి రామ్ నాథ్ ఠాకూర్ లిఖిత పూర్వక సమాధానమిచ్చారు.


ఇప్పటివరకు రాష్ట్రాల్లో 3, 517 బీఆర్సీల ఏర్పాటు..

రైతులకు సేంద్రియ సాగుపై అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తంగా రాష్ట్రాల్లో 10,000 బయోఇన్ పుట్ రిసోర్స్ సెంటర్ల(బీఆర్సీ)ను ఏర్పాటు చేసేందుకు నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ ( ఎన్ఎంఎన్ఎఫ్ ) సిద్ధంగా ఉందని, ఇప్పటివరకు 3,517 బీఆర్సీలను ఏర్పాటు చేసినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి తెలిపారు. క్లస్టర్ స్థాయి సంస్థగా.. రైతులకు ప్రత్యేక శిక్షణ, ప్రదర్శనలు ఉంటాయని, సొసైటీలు, రైతు ఉత్పత్తి సంస్థలు, స్వయం సహాయక బృందాలతో ఈ బీఆర్సీలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఖమ్మం జిల్లాలో 6 బయోఇన్ పుట్ రిసోర్స్ సెంటర్లు

తెలంగాణ రాష్ట్రంలో సేంద్రీయ సాగు ప్రోత్సాహకానికి 250 బీఆర్సీ లను గుర్తించినట్లు, అందులో ఖమ్మం జిల్లాలో 6 ఉన్నాయని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి తెలిపారు. బీజామృత్, జీవామృత్, నీమాస్త్ర, దశపర్ని తదితర సేంద్రీయ ఎరువులను రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. రసాయనిక ఎరువులకు బదులు.. పంటల్లో తెగుళ్ల నివారణకు, మంచి దిగుబడికి ప్రణాళిక ప్రకారం సేంద్రీయ సాగును ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు.





# చొప్పకట్లపాలెం స్కూల్ లో స్పెషల్ ఆఫీసర్ తనిఖీ

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 3, తెలంగాణ ముచ్చట్లు;** బోనకల్ మండలంలోని చొప్పకట్లపాలెంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కె విజయ భాస్కర్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి పుల్లయ్య బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థుల హాజరును పరిశీలించారు. కలెక్టర్ గారి అనుదీప్ దురిశెట్టి ఆదేశాల మేరకు ఎర్లీ చైల్డ్ రీడ్స్ ప్రోగ్రామ్ ను కూడా పరిశీలించారు. ఇక్కడ 80% నుండి 90% వరకు పిల్లలు చదువుకుంటున్నట్లు పాఠశాల ఉపాధ్యాయులు స్పెషల్ ఆఫీసర్ కు నివేదించారు. విద్యార్థులకు స్కూల్ లో అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా స్పెషల్ ఆఫీసర్ పరిశీలించారు. ఇక్కడ ఉన్నటువంటి 40 మంది పిల్లలకు ఈ స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశుభ్రంగా, నాణ్యతతో అందిస్తున్నట్లు తనిఖీ అధికారులు గమనించారు. తమ పిల్లలకు అందిస్తున్న తరహాలోనే పాఠశాల సిబ్బంది చాలా శ్రద్ధతో వంట చేశారని ప్రశంసించారు. అదేవిధంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బోనకల్ మండలంలోని దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు.

# ఎంపీడీవో కార్యాలయాల వద్ద ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాల ఏర్పాటు...

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ -3, తెలంగాణ ముచ్చట్లు;** మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల వద్ద పంచాయతీ ఎన్నికల ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.


రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని అన్నారు.

ఎన్నికల కమీషన్ సూచనల మేరకు ఎన్నికల విధులు నిర్వహించే ఓటర్లకు, అత్యవసర సేవలలో పనిచేసే ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించడం జరుగుతుందని, దీనికోసం పోస్టల్ ఓటింగ్ కేంద్రం/ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం సంబంధిత మండలాల ఎంపీడీవో కార్యాలయాల వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

మొదటి విడత పంచాయతీ ఎన్నికలు జరిగే కొణిజెర్ల, రఘునాథపాలెం, వైరా, బోనకల్, చింతకాని, మధిర, ఎర్రుపాలెం మండలాలలో డిసెంబర్ 5 నుంచి డిసెంబర్ 10 వరకు, రెండవ విడత ఎన్నికలు జరిగే కామేపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి, ముదిగొండ, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాలలో డిసెంబర్ 8 నుంచి డిసెంబర్ 13 వరకు, మూడవ విడత ఎన్నికలు జరిగే ఏన్కూర్, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, తల్లాడ, వేంసూర్, సింగరేణి మండలాలలో డిసెంబర్ 11 నుంచి డిసెంబర్ 16 వరకు సంబంధిత మండల ఎంపీడీవో కార్యాలయాల వద్ద ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పోస్టల్ బ్యాలెట్స్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేసినట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### మరో భారతీయుడిని వరించిన అదృష్టం..

# లాటరీలో రూ.61 కోట్ల భారీ జాక్ పాట్



సౌదీ అరేబియాలో ఉంటున్న భారతీయుడికి భారీ జాక్‌పాట్ తగిలింది. అబుధాబి వేదికగా నిర్వహించే లాటరీ 'బిగ్ టికెట్ డ్రా సిరీస్ 281'లో కేరళకు చెందిన పీవీ రాజన్ రూ.61.37 కోట్లు (25 మిలియన్ల దిర్హామ్‌లు) గెలుచుకున్నారు. రాజన్ నవంబర్ 9న టికెట్ (282824) కొనుగోలు చేయగా, డిసెంబర్ 3న లక్కీ డ్రా తీయగా విజేతగా నిలిచారు. గత 15 ఏళ్లుగా పీవీ రాజన్ 'బిగ్ టికెట్' లాటరీ కొంటున్నప్పటికీ ఈరోజు ఆయనను అదృష్టం వరించింది. లాటరీ నిర్వాహకులు రిచార్డ్, బౌచ్రా సమక్షంలో గత సిరీస్ విజేత అయిన మరో భారతీయుడు శరవణన్ వెంకటాచలం లక్కీ డ్రా తీశారు. ఇందులో రాజన్ కొన్న టికెట్‌కు బంపర్ ఆఫర్ తగలడంతో ఆయన ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. లాటరీ తగిలిన విషయాన్ని ఫోన్లో నిర్వాహకులు చెప్పగా, రాజన్ ఉబ్బితబ్బిబ్బు అయ్యారు. చాలా ఆనందంగా ఉన్నట్లు చెప్పారు. తాను లైవ్ షో చూడలేదని, ఆ సమయంలో బయట ఉన్నట్లు పేర్కొన్నారు. గెలుచుకున్న డబ్బును తన 15 మంది సహచరులతో పంచుకుంటానని తెలిపారు. రాజన్ సౌదీ అరేబియాలోని ఓ కంపెనీలో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్నారు. ప్రముఖ లాటరీ అయిన 'బిగ్ టికెట్ అబుధాబి' ప్రతినెల లక్కీడ్రా నిర్వహిస్తుంది. ప్రతినెలా గ్రాండ్ ప్రైజ్‌తో పాటు పలు కన్సోలేషన్ బహుమతులను సైతం అందిస్తుంది. ఈసారి 10 మంది కన్సోలేషన్ విజేతలు రూ.2.45 లక్షలు(10వేల దిర్హాములు) చొప్పున అందుకున్నారు. వీరిలో ముగ్గురు భారతీయులు సైతం ఉన్నారు. గత నెల 3న తీసిన బిగ్ టికెట్ లక్కీ డ్రాలో తమిళనాడుకు చెందిన శరవణన్ వెంకటాచలం విజేతగా నిలిచి విషయం తెలిసిందే. దీంతో ఆయన 25 మిలియన్ల దిర్హాములు అందుకున్నారు. బిగ్ టికెట్ లాటరీని భారతీయులు వరుసగా రెండోసారి గెలవడం విశేషం.



## పసిడితో వెండి పోటీ..
# రికార్డు గరిష్ఠాలకు సిల్వర్!

సరిగ్గా ఏడాది క్రితం వెండి ధర కిలో తొలిసారి లక్ష రూపాయలు దాటితే వామ్మో! అనుకున్నారంతా. కానీ, ఇప్పుడు అదే వెండి పసిడికి ఏమాత్రం తక్కువ కానంటోంది. పట్టపగ్గాల్లేకుండా దూసుకెళుతోంది. దేశీయంగా కిలో వెండి రూ.1.84 లక్షల వద్ద సరికొత్త రికార్డు గరిష్ఠాలను నమోదు చేసింది. అటు పసిడి సైతం రూ.1.30 లక్షల పైనే పలుకుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధర పెరగడానికి తోడు, రూపాయి విలువ పతనం కావడమూ ఈ లోహాల ధరల పెరుగుదలకు కారణమని అనలిస్టులు విశ్లేషిస్తున్నారు.

మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో గోల్డ్ ఫ్యూచర్స్‌లో 2026 ఫిబ్రవరి కాంట్రాక్ట్ 10 గ్రాముల ధర రూ.1.30 లక్షలు పలుకుతోంది. అదే సమయంలో ఎంసీఎక్స్‌లో మార్చి డెలివరీ వెండి అత్యధికంగా రూ.3,126 పెరిగి రూ.1,84,727 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరింది. బుధవారం డాలరుతో రూపాయి మారకం విలువ 90 మార్కు దాటింది. దీంతో దేశీయంగా వీటి ధరలు పెరిగాయి. దీనికితోడు యూఎస్ ఫెడ్ వడ్డీరేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో ఫ్యూచర్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు పెరుగుదలకు కారణమని అనలిస్టులు విశ్లేషిస్తున్నారు. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు 4,204 వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు 57.90 డాలర్ల వద్ద కొనసాగుతోంది. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి రూ.1.32 లక్షలు పలుకుతుండగా.. కిలో వెండి రూ.1.83 లక్షలుగా ఉంది. గతంలో దేవుళ్ల బొమ్మలు, పూజా సామగ్రి, సంపన్నుల ఇళ్ల ల్లో పళ్లాలు, గ్లాసులకు వెండిని దేశీయంగా వినియోగించేవారు. కొవిడ్ తర్వాత పరిస్థితులు మారాయి. పారిశ్రామికంగా వెండి వినియోగం పెరిగింది. సౌర విద్యుత్ రంగం, విద్యుత్ కార్లు, మొబైల్స్ తదితర రంగాల నుంచి దీనికి డిమాండ్ పెరిగింది. దీనికితోడు చిన్న మదుపరులు పెట్టుబడి కోసం వెండిని కొనడం ప్రారంభించారు. ద్రవ్యోల్బణాన్ని తట్టుకునే శక్తి బంగారంతో పాటు వెండికీ ఉందని చెబుతుండటంతో, మదుపరుల్లో ఆసక్తి పెరుగుతోంది. దీంతో ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు పెడుతున్నారు.



# రూపాయి ఢమాల్..
## తొలిసారి 90 మార్క్ దాటి..

అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి విలువ దారుణంగా పతనమైంది. బుధవారం నాటి ట్రేడింగ్‌లో డాలర్‌తో పోలిస్తే ఏకంగా 90 మార్క్‌ను దాటి సరికొత్త జీవనకాల కనిష్ఠానికి పడిపోయింది. క్రితం సెషన్‌లో 89.96 వద్ద ముగిసిన రూపాయి విలువ (Rupee Value).. నేటి ఆరంభం నుంచే క్షీణిస్తూ వస్తోంది. ఒక దశలో ఏకంగా 90.14 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని తాకింది. ప్రస్తుతం ఉదయం 10 గంటల ప్రాంతంలో 90.12 వద్ద ట్రేడ్ అవుతోంది. దిగుమతిదార్ల నుంచి డాలరుకు అధిక గిరాకీ, షార్ట్‌కవరింగ్ కొనసాగడం లాంటివి రూపాయి క్షీణతకు కారణమయ్యాయి. భారత్‌అమెరికా వాణిజ్య చర్చలపై సందిగ్ధత, విదేశీ సంస్థాగత మదుపర్ల లాభాల స్వీకరణ వంటివి కూడా రూపాయి విలువను బలహీనపరుస్తున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇదిలాగే కొనసాగితే.. రూపాయి విలువ 91కి పడిపోవచ్చని అంచనా వేస్తున్నాయి. మరోవైపు దేశీయ మార్కెట్లు కూడా బుధవారం నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో సెన్సెక్స్ 241 పాయింట్లు దిగజారి 84,897 వద్ద, నిఫ్టీ 103 పాయింట్ల నష్టంతో 25,928 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. ఇదిలా ఉండగా.. నేటి నుంచి ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నేటి నుంచి ప్రారంభం కానుంది. డిసెంబరు 5న వడ్డీ రేట్లపై కేంద్ర బ్యాంకు ప్రకటన చేయనుంది. కీలక వడ్డీరేట్లపై ఆర్‌బీఐ కోత పెట్టే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

## కోర్టు ఆదేశాలతో 42 ఇళ్లు కూల్చివేత..
## విజయవాడ భవానీపురంలో ఉద్రిక్తత

భవానీపురంలోని జోజిపేటలో కోర్టు ఆదేశాల మేరకు 42 ఇళ్లను కూల్చివేశారు. శ్రీలక్ష్మి రామ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి అనుకూలంగా కోర్టు తీర్పు రావటంతో భారీ పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేత జరిగింది. కూల్చివేసిన ప్రాంతం చుట్టూ శ్రీలక్ష్మి రామ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ గోడ కడుతోంది. 42 ఇళ్ల కూల్చివేతతో బాధితులు రోడ్డున పడ్డారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. 25 ఏళ్లుగా నివాసముంటున్న తమను వెళ్లగొడుతున్నారని బాధితుల ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులతో వారంతా వాగ్వాదం చేశారు. సుప్రీంకోర్టు నుంచి స్టే ఆర్డర్ వచ్చినా పట్టించుకోకుండా కూల్చేశారని బాధితులు వాపోయారు. ఉదయం 10.45గంటలకు స్టే వచ్చిన విషయం పోలీసులు, న్యాయవాదుల దృష్టికి తీసుకెళ్లినా వినలేదని బాధితులు అంటున్నారు. సుప్రీంకోర్టు ఆర్డర్ వీడియో చూపించినా కూల్చివేతలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డిసెంబర్ 31 వరకు ఎటువంటి కూల్చివేతలు చేపట్టకూడదని సుప్రీంకోర్టు స్టే ఇచ్చిందన్నారు. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు ఉన్నా లెక్క చేయకుండా ఫ్లాట్స్ కూల్చడంపై న్యాయపోరాటం చేస్తామని బాధితులు తెలిపారు. తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు.

# ఈపీఎస్ కనీస పింఛను రూ.7,500కు పెంచుతారా? కేంద్రం ఏం చెబుతోంది..?

ఉద్యోగుల పింఛను నిధి పథకం (ఈపీఎస్) ఆదాయం పెరుగుతున్నా.. లబ్ధిదారులు కనీస పింఛను పెంపునకు నోచుకోక అవస్థలు పడుతున్నారు. కనీస పింఛను మొత్తాన్ని రూ.1,000 నుంచి రూ.7,500కు పెంచాలని ఈపీఎస్95 పథకానికి చెందిన వేలమంది పింఛనుదారులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశాన్ని తాజాగా పార్లమెంట్‌లోనూ ఓ సభ్యుడు లేవనెత్తారు. అయితే, పెన్షన్ పెంచే ప్రతిపాదనేదీ లేదని తాజాగా కార్మికశాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే వెల్లడించారు. ఇందుకు ఆమె వివరణ కూడా ఇచ్చారు.




"ఉద్యోగుల పింఛను నిధికి మూలధనం అనేది వేతనాల్లో యజమాని 8.33 శాతం వాటాతో, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పడుతుంది. ఆ లెక్కల నుంచి వచ్చిన ఆదాయంతోనే ఈ స్కీమ్ కింద అన్ని ప్రయోజనాలు అందిస్తున్నాం. ఏటా ఈ నిధిని అంచనా వేస్తుంటారు. అయితే, ప్రస్తుతం ఆ మూల్యాంకనం ప్రకారం ఈ పింఛను ఫండ్ లోటులో ఉంది. దీనికి సరైన రిటర్నులు రానందున.. ప్రస్తుత నిబంధనల ప్రకారం కనీస పింఛను చెల్లించేందుకు ప్రభుత్వం అదనపు నిధులు కల్పించాల్సి వస్తోంది" అని మంత్రి వివరించారు. దీంతో ఇప్పట్లో ఈపీఎస్ కనీస పింఛన్‌ను పెంచే అవకాశాలు కన్పించట్లేదు.

ఈపీఎస్ అనేది ఈపీఎఫ్‌లో ఒక భాగం. ఈపీఎఫ్‌లో సభ్యులైన ఉద్యోగులకు ఇది వర్తిస్తుంది. దీంతో ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే, ప్రైవేట్ రంగంలోని ఉద్యోగులు కూడా పదవీవిరమణ తర్వాత నెలవారీ పింఛను పొందొచ్చు. ఉద్యోగి మరణించిన తర్వాత కూడా నామినీకి ఈ పింఛను వస్తుంది. ఉద్యోగి, సంస్థ 12 శాతం చొప్పున ఉద్యోగి వేతనానికి సమానమైన మొత్తాన్ని ప్రతి నెలా ఈపీఎఫ్‌లో జమ చేస్తారు. సంస్థ వాటా అయిన 12 శాతంలో 8.33 శాతం ఈపీఎస్‌కి వెళ్తుంది. మిగతా 3.67 శాతం ఈపీఎఫ్‌కి చేరుతుంది. అంటే, ఈపీఎస్ కోసం ఉద్యోగి పనిచేసే సంస్థ కాంట్రిబ్యూట్ చేస్తుంది.

### పింఛను ప్రయోజనాలివే..

ఈ పింఛను నెలకు కనీసం రూ.1,000 లభిస్తుంది. గరిష్ఠంగా రూ.7,500 పొందే వీలుంది. (ఇప్పుడు కనీస మొత్తాన్ని రూ.7,500కు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. అంటే గరిష్ఠ పింఛను మొత్తం కూడా పెరుగుతుంది)

ఉద్యోగి 58 ఏళ్ల తర్వాత లేదా పదవీ విరమణ పొందిన తర్వాత ఈ పింఛనును పొందొచ్చు. 50 ఏళ్ల వయసు నుంచే ముందస్తు పింఛను అందుకునే సౌకర్యమూ ఉంది.

ఉద్యోగి చనిపోతే వారి భాగస్వామికి ఈ పింఛను అందుతుంది. ఒకవేళ భాగస్వామి లేకపోతే పిల్లలు 25 ఏళ్లు వచ్చేవరకు ఈ పింఛను పొందొచ్చు.

భార్య లేదా భర్తను కోల్పోయినవారు తిరిగి పెళ్లి చేసుకుంటే కేవలం పిల్లలకు మాత్రమే (25ఏళ్లు వచ్చేంతవరకు) ఈ పింఛను పొందే వీలుంది.

పిల్లలు దివ్యాంగులైతే.. జీవితకాలం ఈ పింఛను అందుకోవచ్చు.

ఈ పింఛను క్లెయిమ్ చేసుకునేందుకు ఈపీఎఫ్‌వో నుంచి పెన్షన్ సర్టిఫికెట్ పొందడం అవసరం.

# నాలుగో రోజూ నష్టాలే.. 26వేల దిగువకు నిఫ్టీ

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి ఫ్లాట్‌గా ముగిశాయి. ఆర్‌బీఐ ఎంపీసీ వేళ మదుపర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఈ నెల 5న ఆర్‌బీఐ వడ్డీ రేట్లపై ప్రకటన చేయనుంది. దీంతో వరుసగా నాలుగోరోజూ సూచీలకు నష్టాలు తప్పలేదు. ఆఖర్లో కాస్త కొనుగోళ్ల మద్దతు కనిపించినా ప్రయోజనం లేకపోయింది. ఈ క్రమంలోనే నిఫ్టీ మళ్లీ 26వేల మార్కు దిగువన ముగిసింది.

సెన్సెక్స్ ఉదయం 85,150.64 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,138.27) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 84,763.64 85,269.68 మధ్య ఓ మోస్తరు శ్రేణిలోనే కదలాడింది. చివరికి 31.46 పాయింట్ల నష్టంతో 85,106.81 వద్ద ముగిసింది. నిఫ్టీ 46.20 పాయింట్ల నష్టంతో 25,986 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.21గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బీఈఎల్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎన్టీపీసీ, ఎస్‌బీఐ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 63.21 డాలర్లు, బంగారం ఔన్సు 4202 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



# రూపాయి పతనంపై ప్రభుత్వం ఆందోళన చెందడం లేదు: సీఈఏ




డాలరుతో రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠస్థాయికి చేరింది. తొలిసారి 90 మార్కు దాటింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు (CEA) వి అనంత నాగేశ్వరన్ కీలక వ్యాఖ్యలు చేశారు. రూపాయి విలువ 90 రూపాయల మార్కు దాటడం పట్ల ప్రభుత్వం ఆందోళనేమీ చెందడం లేదని పేర్కొన్నారు. దీనివల్ల అటు ద్రవ్యోల్బణంపై గానీ, ఎగుమతులపై గానీ ప్రభావం ఉండబోదని చెప్పారు. వచ్చే ఏడాది పరిస్థితి మెరుగవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. సీఐఐ ఈవెంట్‌లో భాగంగా ఆయన మాట్లాడారు. రూపాయి విలువ బుధవారం ఇంట్రాడేలో 90.30 వద్ద కనిష్ఠాన్ని తాకింది. మంగళవారం ముగింపుతో పోలిస్తే 34 శాతం మేర క్షీణించింది. ఎఫ్ఐఐల అమ్మకాలు, డాలర్‌కు కొనుగోళ్ల మద్దతు వంటివి కారణమని అనలిస్టులు చెబుతున్నారు. దేశీయ ఈక్విటీ మార్కెట్‌లో క్షీణత, భారత్ అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం విషయంలో ఇప్పటికీ ఒక స్పష్టత రాకపోవడమూ కారణమని ఫారెక్స్ ట్రేడర్లు చెబుతున్నారు. రూపాయి విలువ పతనం విషయంలో కేంద్ర ప్రభుత్వంపై విపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి.

# వివాదం వేళ సంచార్ సాథీ డౌన్‌లోడ్స్‌లో బిగ్ జంప్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంచార్ సాథీ యాప్ డౌన్‌లోడ్స్ అనూహ్యంగా పెరిగాయి. ఈ యాప్‌ను ప్రీ ఇన్‌స్టాల్ యాప్‌గా ఇవ్వాలని మొబైల్ తయారీ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం.. దీన్నో 'స్నూపింగ్' యాప్‌గా విపక్షాలు పేర్కొనడంతో దీనిపై వివాదం రాజుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ యాప్ డౌన్‌లోడ్స్ ఒక్కసారిగా పెరిగాయని డాట్ (DoT) వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటివరకు ఈ యాప్‌ను 1.5 కోట్ల మంది ప్రజలు తమ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకున్నారు. వివాదానికి ముందువరకు రోజుకు సగటున 60 వేల మంది ఇన్‌స్టాల్ చేసుకున్నారు. తాజాగా సగటున డౌన్‌లోడ్ల సంఖ్య ఒక్కసారిగా 60 వేల నుంచి 6 లక్షలకు పెరిగాయని డాట్ వర్గాలు తెలిపాయి. గతంతో పోలిస్తే 10 రెట్లు అధికమని పేర్కొన్నారు.




కొత్తగా వచ్చే సెల్‌ఫోన్లలో సంచార్ సాథీ యాప్‌ను ముందుగానే ఇన్‌స్టాల్ చేసి ఇవ్వాలని కేంద్రం నవంబర్ 28న ఆదేశాలు ఇచ్చింది. ఇది ప్రజల వ్యక్తిగత జీవితాల్లోకి తొంగిచూసే చర్య అని విపక్షాలు ఆందోళన వ్యక్తంచేశాయి. అయితే కంపెనీలు ముందుగానే ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి ఇచ్చినా.. వినియోగదారులు డిలీట్ చేసుకోవచ్చని ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఈ యాప్ ద్వారా స్నూపింగ్ గానీ, కాల్స్ పర్యవేక్షణ గానీ జరగబోదని టెలికం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. ఇప్పటివరకూ 2.75 కోట్ల మోసపూరిత మొబైల్ కనెక్షన్లను తొలగించామని, చోరీకి గురైన 20 లక్షల ఫోన్ల లొకేషన్‌ను గుర్తించి అందులో 7.5 లక్షల ఫోన్లను పోగొట్టుకున్నవారికి అందజేశామని తెలిపారు.

### ఏమిటీ యాప్ ప్రత్యేకత?

సంచార్ సాథీ యాప్‌లో అనేక అధునాతన ఫీచర్లున్నాయి. ఈ యాప్‌ను మొబైల్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ అయిన తర్వాత ఫోన్ నంబరు కేంద్రీకృత డేటాబేస్ దీంతో అనుసంధానం అవుతుంది. చట్టబద్ధంగా తీసుకున్న ప్రతి మొబైల్ వివరాలు రికార్డయి ఉంటాయి. ఫోన్ పోయినా, దొంగతనానికి గురైనా ఈ యాప్ ద్వారా బ్లాక్ చేసేలా ఫిర్యాదు చేసుకోవచ్చు. ఆ తర్వాత సంబంధిత మొబైల్ ఎక్కడా పని చేయకుండా అన్ని నెట్‌వర్క్‌లను అలర్ట్ చేస్తుంది. దాంతో సిమ్ మార్చినా ఫోన్‌తో ఉపయోగం లేకుండాపోతోంది. అనుమానిత కాల్స్, మెసేజ్‌లు వచ్చినప్పుడు కాల్‌లాగ్ నుంచే నేరుగా ఫిర్యాదు చేసుకోవచ్చు. మీ పేరు మీద ఎన్ని మొబైల్ కనెక్షన్లు ఉన్నాయో తెలుసుకోవచ్చు. అనధికారికంగా ఏవైనా నంబర్లు ఉంటే ఫిర్యాదు చేయొచ్చు. మొబైల్ చోరీకి గురైనా, పొరపాటున పారేసుకున్నా బ్లాక్ చేసే సదుపాయం ఉంది. మొబైల్ ఫోన్ ప్రామాణికతను సంచార్ సాథీ యాప్ సాయంతో గుర్తించొచ్చు. సెకండ్ హ్యాండ్ మొబైల్ కొనుగోలు చేసేటప్పుడు ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఉద్యోగాల చిరునామా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

ఏళ్లకేళ్లుగా నియామకాలకు నోచుకోక తల్లడిల్లిన తెలంగాణ నిరుద్యోగ యువత భవిష్యత్తుకు భద్రత కల్పించింది. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొలువుల పండుగను నిర్వహించి నిరుద్యోగులకు తన చేతుల మీదుగా నియామక పత్రాలను అందించి సరికొత్త ఒరవడి నెలకొల్పారు. కొత్తగా ఉద్యోగాలు సాధించిన యువతీ యువకుల సందడి.. వారి కుటుంబాల ఆనందంతో రాష్ట్రంలోని అన్ని పల్లెలు. పట్టణాల్లో కొలువుల పండుగ స్ఫూర్తి వెల్లివిరిసింది.

ఉద్యోగాల భర్తీలో తెలంగాణ ఈ రెండేండ్లలో కొత్త రికార్డు నమోదు చేసింది. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా భారీ సంఖ్యలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టింది. 61379 ప్రభుత్వ ఉద్యోగాలను యుద్ధప్రాతిపదికన భర్తీ చేసింది. మరో 8632 పోస్టుల నియామకాలు తుది దశలో ఉన్నాయి. వీటితో కలిపితే మొత్తం ఉద్యోగ నియామకాల సంఖ్య 70011. త్వరలోనే లక్ష ఉద్యోగాల మైలురాయిని అందుకునే దిశగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలు మిగతా రాష్ట్రాలకు సైతం ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయి. ఉద్యోగాల భర్తీలోనూ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా కీలక రంగాలకు ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. రాష్ట్రంలో పాలనా విభాగంలో అత్యున్నతమైన సర్వీసులతో పాటు విద్యా రంగానికి. వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి యూపీఎస్సీ తరహాలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేపట్టారు. అప్పటి వరకు పెండింగ్ లో ఉన్న పరీక్షలు, ఫలితాలకు ఉన్న అడ్డంకులన్నింటినీ తొలిగించే చర్యలు వేగవంతం చేశారు. పదేండ్లుగా ఉద్యోగాల భర్తీ లేనందున యువత నష్టపోకుండా టీజీపీఎస్సీ నియామకాల వయో పరిమితిని ప్రజా ప్రభుత్వం సడలించింది.

గతంలో ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి ఎప్పుడు పరీక్షలు నిర్వహిస్తారో.. ఫలితాలు ఎప్పుడు ప్రకటిస్తారో.. నియామక పత్రాలు ఎపుడిస్తారో అనే క్లారిటీ ఉండేది కాదు. కానీ రాష్ట్ర ప్రభుత్వం తొలి రెండేండ్లలోనే కీలకమైన పరీక్షలను విజయవంతంగా నిర్వహించి.. చెప్పిన సమయానికి పోస్టింగ్లు కూడా ఇచ్చేసింది. రిక్రూట్?మెంట్? పరీక్షల్లో ప్రతిభను చాటి ఉద్యోగాలకు ఎంపికైన యువతను అభినందించేందుకు.. వారికి నియామక పత్రాలు అందించేందుకు స్వయంగా సీఎం ప్రత్యేక చొరవ చూపారు. రెండేండ్లలో 13 సార్లు కొలువుల పండగ వేడుకలు నిర్వహించారు. రాష్ట్రంలో ఉద్యోగాలు సాధించిన యువతను ఆహ్వానించి ఎల్ బీ స్టేడియం, శిల్ప కళా వేదికలో భారీ వేడుకగా కొలువుల పండగ జరిపారు. స్వయంగా సీఎం హాజరై నియామక పత్రాలు అందించి నిరుద్యోగుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను చాటిచెప్పారు. ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులు,






వారి తల్లిదండ్రులతో కలిసి నియామక పత్రాలను అందుకోవటం నవతరానికి కొత్త స్ఫూర్తిని అందించింది. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో వార్షిక జాబ్ క్యాలెండర్ను ప్రకటించింది. క్యాలెండర్ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను నిరంతర పక్రియగా నిర్వహించే వినూత్న విధానాన్ని అమల్లోకి తెచ్చింది. సివిల్ సర్వీసెస్ తరహాలో తెలంగాణలో అత్యున్నతమైన సర్వీసు ఉద్యోగాలకు నిర్వహించే తొలి గ్రూప్ 1 రిక్రూట్?మెంట్?ను ప్రజా ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించింది. గతంలో పేపర్ లీకేజీతో ఆందోళనకు గురైన యువతకు ఉద్యోగ నియామక పత్రాలను అందించింది. గత ప్రభుత్వ హయాంలో పేపర్ లీకేజీ, పరీక్షల నిర్వహణలో లోపాల కారణంగా గందరగోళమైన గ్రూప్ 1 పరీక్షను కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేసింది. 562 పోస్టులతో కొత్త నోటిఫికేషన్ ఇచ్చింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. ఈ పరీక్షల్లో విజేతలుగా నిలిచి.. గ్రూప్ 1 సర్వీస్ కు ఎంపికైన అభ్యర్థులకు ఈ ఏడాది సెప్టెంబర్ 27న హైదరాబాద్లోని శిల్పకళావేదికలో సీఎం నియామక పత్రాలు అందజేశారు. టీజీపీఎస్సీ అధ్వర్యంలో గ్రూప్ 2 పరీక్షలను కూడా ప్రభుత్వం ప్రశాంతంగా నిర్వహించింది. 2024 డిసెంబర్ 15 ,16 తేదీల్లో జరిగాయి. పరీక్షలకు సంబంధించిన తుది ఫలితాలు 2025 సెప్టెంబర్ 28న విడుదల చేసి.. ఉద్యోగాలకు ఎంపికైన 782 మంది అభ్యర్థులకు అక్టోబరు 18న ప్రభుత్వం నియామక పత్రాలు అందించారు. టీజీపీఎస్సీ గ్రూప్ 3 సర్వీస్ పోస్టుల కోసం మూడేండ్ల కిందట విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రజా ప్రభుత్వం హయంలో గాడిలో పడింది. 1365 పోస్టులతో 2022 డిసెంబర్ 30న నోటిఫికేషన్ విడుదలైతే.. గత ఏడాది నవంబర్ 17, 18 తేదీల్లో ఈ పరీక్షలు జరిగాయి. ఈ ఏడాది మార్చిలో ఫలితాలు విడుదలయ్యాయి. ప్రస్తుతం, సర్టిఫికేట్ వెరిఫికేషన్ పక్రియ కొనసాగుతోంది. త్వరలోనే వీరికి పోస్టింగులు ఇచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. గత ప్రభుత్వం పెండింగ్ లో పెట్టిన గ్రూప్ 4 తుది ఫలితాలను టీజీపీఎస్సీ ప్రకటించింది. ప్రజా ప్రభుత్వం తొలి విజయోత్సవాల సందర్భంగా పెద్దపల్లి నిర్వహించిన యువ వికాసం వేదికపై మొత్తం 8143 మంది ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించారు. టీజీపీఎస్సీ వివిధ నోటిఫికేషన్ల ద్వారా ఈ రెండేండ్లలోనే 15,780 ఉద్యోగ నియామకాలు చేపట్టింది. గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 4 నియామకాలకు అదనంగా ఇతర విభాగాల్లో 6293 పోస్టులను భర్తీ చేసింది. గత పదేండ్లలో నిర్లక్ష్యానికి గురైన విద్యా వ్యవస్థలో ఖాళీల భర్తీకి ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. తొలి ఏడాదిలోనే మెగా డీఎస్సీ నిర్వహించి 11,062 పోస్టులు భర్తీ చేసింది. నిరుడు జులైలో పరీక్షలు నిర్వహించి, రికార్డు వేగంతో సెప్టెంబర్ 30న ఫలితాలను వెల్లడించింది. వీరిలో 10,006 మంది ఉద్యోగాల్లో చేరారు. రెసిడెన్షియల్ సొసైటీల పరిధిలో టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ కాలేజీ లెక్చరర్ పోస్టులన్నీ కలిపి.. కొత్త ప్రభుత్వం 8,400 మందికి నియామక పత్రాలను అందించింది. కొత్తగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరీ తరగతులకు క తాత్కాలిక పద్ధతిన నియామకాలు చేపట్టింది. పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా కానిస్టేబుల్ పోస్టుల నియామకాలకు ఉన్న అడ్డంకులన్నింటినీ ప్రభుత్వం అధిగమించింది. ఎంపికైన 16,067 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించింది.

మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు 8666 మంది ఉద్యోగ నియామకాలు విజయవంతంగా పూర్తి చేసింది. వీటిలో 6,956 స్టాఫ్ నర్స్ లతో పాటు 1260 ల్యాబ్ టెక్నిషియన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ 422, ఆయుష్ మెడికల్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, ఫిజియోథెరపిస్ట్, డ్రగ్ ఇన్స్పెక్టర్ పోస్టులున్నాయి. వీటితో పాటు మరో 7267 పోస్టుల భర్తీ వివిధ దశల్లో ఉంది. వచ్చే ఏడాది మార్చి నాటికి ఈ నియామకాలు పూర్తయ్యే అవకాశాలున్నాయి.



## పవన్ వ్యాఖ్యలు తెలంగాణకు వ్యతిరేకం

హైదరాబాద్,డిసెంబర్3( తెలంగాణ ముచ్చట్లు):

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్రంగా స్పందించారు. ఎల్బీనగర్లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన ఆమె, పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు తెలంగాణకు వ్యతిరేకంగా ఉన్నాయని విమర్శించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తమ బిడ్డలు ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేసిన కవిత, పవన్ కళ్యాణ్ మాత్రం ఆనాటి నుంచి ఇనాటి వరకు తెలంగాణకు వ్యతిరేకంగానే ఉన్నారని మండిపడ్డారు.

పవన్ కళ్యాణ్ తెలంగాణ నాయకుల దిష్టి కళ్లతో కోనసీమ పాడైందని అనడంపై కవిత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు ఏనాడూ దిష్టి పెట్టలేదు. కోనసీమ మాదిరిగా తెలంగాణ కావాలనుకున్నాం. తెలంగాణ బిడ్డల మనసు చాలా గొప్పది, మేము పెద్దగా ఆలోచిస్తాం అని ఆమె అన్నారు. తమ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు అవుతున్నా, ఎప్పుడు కూడా జై తెలంగాణ, జై ఆంధ్రా అనే తాము కోరుకున్నామని, తెలంగాణ ఎంత బాగుందో ఆంధ్రా కూడా అంతే బాగుండాలని ఆకాంక్షించామని ఆమె స్పష్టం చేశారు. ఆంధ్రకు ప్రత్యేక హోదా ఇవ్వాలని నేను పార్లమెంట్లో కూడా మాట్లాడాను. పక్కోడు బాగుంటే మా కళ్లు మండవు. పక్కోనిది గుంజుకోవాలనుకునే వాళ్లం కాదు. మేము బాగుండాలని కోరుకుంటాం కానీ, పక్కోడు చెడిపోవాలని అనుకోం. అలా అనుకొని ఉంటే తెలంగాణ ఉద్యమ స్వరూపం వేరేలా ఉండేది. మా బిడ్డలు ప్రాణాలు త్యాగం చేశారే తప్ప, ఒక్క పరాయి రాష్ట్రం వారి మీద కూడా చేయి ఎత్తలేదని కవిత వివరించారు. ఆనాడు సినిమా నటుడిగా మాట్లాడారు కానీ, ఇప్పుడు పవన్ కళ్యాణ్ ఏపీ డిప్యూటీ సీఎం అని, ఆయన మాటలు ఆంధ్రా ప్రజలకు ఆపాదిస్తారని కవిత హెచ్చరించారు. కనుక పవన్ కళ్యాణ్ జాగ్రత్తగా ఆలోచన చేసి మాట్లాడాలని ఆమె సూచించారు.

## కోకాపేటలో కాసులు కురిపిస్తున్న వేలం

(మొదటి పేజీ తరువాయి)

ప్లాట్ నెంబర్ 19లో ఎకరానికి రూ.131 కోట్లు, ప్లాట్ నెంబర్ 20లో ఎకరం రూ.118 కోట్ల ధర పలికింది. 8.04 ఎకరాలకు హెచ్ఎండీఏకు రూ. వెయ్యి కోట్ల మేర ఆదాయం సమకూరింది. మొత్తం 3 విడతల్లో ఆరు ప్లాట్లలోని 27 ఎకరాలకు రూ.3,708 కోట్ల ఆదాయం లభించింది.

ఈసారి మొత్తం 44 ఎకరాల భూమిని నాలుగు విడతల్లో హెచ్ఎండీఏ వేలం వస్తోంది. కోకాపేట గోల్డెన్ మైల్లోని 2 ఎకరాలు, మూసాపేటలోని 15 ఎకరాలకు డిసెంబర్ 5న ఈ 'వేలం వేయనుంది.

## ఐఎండీబీ పాపులర్ నటులు, దర్శకుల జాబితా



సినిమాలకు సంబంధించి రేటింగ్ పరంగా అత్యంత విశ్వసనీయత కలిగిన ఆన్లైన్ వేదికగా పేరున్న ఇంటర్నెట్ మూవీ డేటా బేస్ ఐఎండీబీ ప్రతి ఏడాది సినిమాలతో పాటు తారలకు సంబంధించి వివిధ కేటగిరీలలో ప్రేక్షకాదరణ పొందిన జాబితాను ప్రకటిస్తున్నది. తాజాగా ఈ ఏడాది పాపులర్గా నిలిచిన తారల జాబితాను విడుదల చేసింది. ఇందులో తెలుగు నుంచి ఒక్కరు కూడా చోటు దక్కించుకోకపోవడం విశేషం. సైయారా సినిమాతో సూపర్ హిట్ అందుకున్న బాలీవుడ్ యువ నటులు ఆహన్ పాండే, అనిత్ పడ్డా.. వరుసగా మొదటి రెండు స్థానాలను కైవసం చేసుకున్నారు. మోహిత్ సూరి దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్ను అందుకుంది. ఇక కూలీ కామియోతో మెరిసిన ఆమిర్ ఖాన్ ఈ ఏడాది మోస్ట్ పాపులర్ తారల జాబితాలో మూడవ స్థానంలో నిలిచాడు. హోమ్ బౌండ్ సినిమాతో మెప్పించిన ఇషాన్ ఖట్టర్ నాలుగవ స్థానంలో నిలువగా.. బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్ సినిమాతో అలరించిన నటుడు లక్ష్య ఐదవ స్థానంలో దక్కించుకున్నాడు. రష్మిక మందన్నా ఆరో స్థానంలో నిలువగా.. లోక చిత్రంతో సూపర్ హిట్ అందుకున్న కళ్యాణి ప్రియదర్శన్ ఏడో స్థానం దక్కించుకుంది. ధడక్ సినిమాలో నటనకు గాను తృప్తి డిమ్రి ఎనిమిదో స్థానంలో నిలువగా.. రుక్మిణి వసంత్ 9వ స్థానం, రిషబ్ శెట్టి 10వ స్థానం దక్కించుకున్నారు

దర్శకుల జాబితాలో ఐఎండీబీ విడుదల చేసిన డేటా ప్రకారం ఈ ఏడాది మోస్ట్ పాపులర్ దర్శకులు ఎవరు అనేది చూసుకుంటే. సైయారాతో సూపర్ హిట్ అందుకున్న దర్శకుడు మోహిత్ సూరి ఈ ఏడాది మోస్ట్ పాపులర్ దర్శకులలో అగ్ర స్థానంలో నిలిచాడు. బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్తో ఎంట్రీ ఇచ్చిన షారుఖ్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ ఈ ఏడాది రెండో స్థానంలో నిలిచాడు. కూలీ సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న లోకేష్ కనకరాజ్ మూడో స్థానంలో నిలువగా.. నిశాంఛీతో హిట్ అందుకున్న అనురాగ్ కశ్యప్ నాలుగో స్థానంలో, ఎల్ 2 ఎంపురాన్ సినిమాతో హిట్ అందుకున్న పృథ్వీరాజ్ సుకుమారన్ ఐదో స్థానంలో నిలిచారు. ఆమిర్ ఖాన్తో సితారే జమీన్ పర్ లాంటి సూపర్ హిట్ అందుకున్న దర్శకుడు ఆర్.ఎస్. ప్రసన్న ఆరో స్థానంలో నిలువగా.. మెట్రో ఇన్ డినోతో అనురాగ్ బసు ఏడో స్థానంలో నిలిచాడు. మలయాళం కొత్త లోక సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న దర్శకుడు డొమినిక్ అరుణ్ ఎనిమిదో స్థానంలో చోటు దక్కించు కోగా.. ఛావా దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ 9వ స్థానం, హోమ్ బౌండ్ చిత్రంతో నీరజ్ ఘైవాన్ 10వ స్థానంలో చోటు దక్కించుకున్నాడు.

## కార్తీ...తెలుగులో అన్నగారు వస్తారు

స్టార్ నటుడు కార్తీ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం వా వాతియార్ . తెలుగులో ఈ చిత్రం అన్నగారు వస్తారు అనే పేరుతో విడుదల కాబోతుంది. నలన్ కుమారస్వామి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కృతి శెట్టి కథానాయికగా నటిస్తుండగా.. సత్యరాజ్, రాజ్ కిరణ్, జిఎం సుందర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. స్టూడియో గ్రీన్ పతాకంపై కెఇ జ్ఞానవేల్ రాజా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి తాజాగా విడుదల తేదీని ప్రకటించింది చిత్రబృందం. ఈ సినిమాను డిసెంబర్ 12న తమిళంతో పాటు తెలుగులో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమాలో కార్తీ పోలీస్ పాత్రలో నటించబోతున్నట్లు తెలుస్తుంది. మరోవైపు కార్తీ సర్దార్ 2ని కూడా విడుదలకు సిద్ధం చేస్తున్నాడు.




## ఐటమ్ సాంగ్లతో పూజ అదుర్స్



తెలుగు సినీ పరిశ్రమలో ఒకప్పుడు టాప్ హీరోలందరి సరసన వరుసగా నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పూజా హెగ్డే, గత కొన్నేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఆమె నటించిన కొన్ని పెద్ద సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడకపోయినా స్టార్ ఇమేజ్ ఏమాత్రం తగ్గలేదు. గ్లామర్, డాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్ లాంటి అంశాల్లో పూజాతో సరితూగే వారు లేరని చెప్పాలి. అల్లు అర్జున్, మహేశ్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, ప్రభాస్, రామ్ చరణ్ వంటి అగ్ర నటులతో నటించటం ఆమె కెరీర్కే ప్రత్యేక గుర్తింపునిచ్చింది వరుస ఫ్లాప్ల వల్ల లీడ్ రోల్స్ తగ్గినా, పూజా మాత్రం వెనక్కి తగ్గలేదు. హీరోయిన్గా కాకపోయినా, స్పెషల్ సాంగ్స్, స్పెషల్ రోల్స్ చేసుకుంటూ తన స్టార్ ప్రెజెన్స్ను కొనసాగించాలని నిర్ణయించుకుంది. 'కూలీ' సినిమాలో 'మౌనిక' సాంగ్ విజయంతో పూజా మరోసారి హాట్ టాపిక్గా మారింది. ఆమె డాన్స్, లుక్స్, గ్లామర్ ఆ పాటను దక్షిణాది వ్యాప్తంగా వైరల్ చేశాయి. ఈ సాంగ్ హిట్ తర్వాత పూజాకు స్పెషల్ సాంగ్ ఆఫర్లు వరుసగా వస్తున్నాయి. ఇండస్ట్రీ టాక్ ప్రకారం, అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్లో రూపొందుతున్న భారీ ప్రాజెక్ట్లోని ప్రత్యేక గీతం కోసం పూజా హెగ్డేను ఫైనల్ చేసినట్లు సమాచారం. ఈ సాంగ్ కోసం ఆమెకు రూ.5 కోట్లు పారితోషికం ఆఫర్ చేసినట్లు టాలీవుడ్ సర్కిల్స్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.. ఒక ఐటెమ్ సాంగ్కి ఇది అరుదైన భారీ రేమ్యునరేషన్. ఇది పూజా మార్కెట్ ఇంకా బలంగానే ఉందని మరోసారి నిరూపిస్తోంది. సినిమా అవకాశాలు తగ్గినా, సోషల్ మీడియాలో మాత్రం పూజా హాట్ ఫేవరెట్. 2010లో మిస్ ఇండియా పోటీలో రెండోస్థానం సాధించి గ్లామర్ రంగంలోకి అడుగుపెట్టిన పూజా హెగ్డే 2012లో తమిళం 'ముగమూడి' ద్వారా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. 2014లో వరుణ్ తేజ్ సరసన 'ముకుంద' తో టాలీవుడ్కి పరిచయం కాగా, ఆ తర్వాత 'ఒక లైలా కోసం', బాలీవుడ్లో 'మోహెంజో దారో' వంటి సినిమాలతో ప్రయాణం కొనసాగించింది. ప్రస్తుతం ఆమె ప్రధాన పాత్రల కంటే స్పెషల్ సాంగ్లపైనే దృష్టి పెడుతుంది. స్పెషల్ సాంగ్లతో తన మార్కెట్ను తిరిగి పదిలం చేసుకుంటున్న పూజా, త్వరలోనే మళ్లీ స్టార్ హీరోల సరసన హీరోయిన్గా కనిపించే అవకాశాలు బలంగా ఉన్నాయని టాక్.

## ప్రియాంక చోప్రాకు కల్కిలో ఆఫర్?

ప్రపంచవ్యాప్తంగా స్టార్డమ్ సంపాదించిన గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రాకు తెలుగు ప్రేక్షకులలోను ప్రత్యేక గుర్తింపు ఉంది. మోడల్గా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత బాలీవుడ్ నుంచి హాలీవుడ్ వరకు తనదైన ముద్ర వేసుకున్న ఆమె మహేష్ బాబు ` ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్లో తెరకెక్కుతున్న భారీ చిత్రం వారణాసిలో మందాకిని అనే కీలక పాత్రలో కనిపించనున్నారు. మహేష్ బాబు కెరీర్లోనే అత్యంత భారీ బడ్జెట్తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఈవెంట్లో ప్రియాంక తన లుక్తో ఆకట్టుకుంది. అయితే ఒకవైపు వారణాసి చిత్రం చేస్తున్న ప్రియాంక చోప్రా ఇప్పుడు మరో తెలుగు సినిమాకి సైన్ చేసిందని అంటున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న కల్కి 2 కోసం ఆమెని సంప్రదించగా దానికి ప్రియాంక గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని అంటున్నారు. కల్కి తొలి పార్ట్లో నటించిన దీపికా పదుకొణెళి పలు కారణాల వలన తప్పుకోవడంతో ఆ స్థానంలో ప్రియాంకని తీసుకుంటున్నట్టు టాక్. సీక్వెల్లో కమల్ హాసన్ విలన్గా కనిపించి తన నటనతో ప్రేక్షకుల మైండ్ బ్లాక్ చేయనున్నాడు. సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి. మరి ప్రియాంక ఇందులో నటించనుందని వస్తున్న వార్తలలో నిజం ఎంత ఉందనేది తెలియాల్సి ఉంది. 2000లో మిస్ వరల్డ్గా కిరీటాన్ని గెలుచుకున్న ప్రియాంక, తర్వాత హిందీ చిత్రాల్లో
వరుస విజయాలు సాధించారు. ఫ్యాషన్ చిత్రంతో జాతీయ ఉత్తమ నటి అవార్డు ను గెలుచుకుని దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందారు. ఆ తర్వాత హాలీవుడ్లో క్వాంటికో, బేవాచ్, సిటాడెల్ వంటి ప్రాజెక్టులతో అంతర్జాతీయ స్థాయిలో స్టార్డమ్ సంపాదించారు. రామ్ చరణ్తో కలిసి ఆమె నటించిన జంజీర్ రీమేక్తో టాలీవుడ్ ప్రేక్షకులకు సుపరిచితురాలయ్యారు. ఆ చిత్రం తెలుగులో తుఫాన్గా విడుదలైంది.




Printed, Published and Owned by B.PRAMOD KUMAR, B258, Phase1, Vanasthalipuram, Hyderabad70. Printed at Garuda Printers, Plot No.91, Sri Ramnagar Colony, Kharmanghat, Hyderabad500035, Telangana. Published at H.No. B258, Phase1, Vanasthalipuram, Hyderabad500070, Telangana. Editor: N.Ramakrishna Reddy, email: citytimestd@gmail.com, RNI: APTEL/2001/5896